

స్లాబ్‌కు రంధ్రాలు చేసిన దృశ్యం..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

బౌరంపేట్‌లో సోమవారం టౌన్‌ప్లానింగ్ కూల్చివేతలు..

# బౌరంపేట్ చర్యలు భేష్..!
# గండిమైసమ్మ సంగతేంటి..?

## పదుల సంఖ్యలో ప్రమాదకర అక్రమ కట్టడాలు..! చర్యలేవి సారూ..?

- ఒకే సర్కిల్‌లో.. అక్రమ నిర్మాణాలపై అధికారుల ద్వంద్వ వైఖరి..
- ప్రమాదకర అక్రమ నిర్మాణాలకు నిలయంగా "దుండిగల్ సర్కిల్-59"..?
- ప్రజల ప్రాణాలకంటే పనికిమాలిన సిఫార్సులకే ప్రాధాన్యతిస్తున్న వైనం..
- ప్రమాదాలు సంభవిస్తేనే గచ్చిబౌలి తరహాలో, చర్యలకు ఉపక్రమిస్తారా..?
- పేపర్‌పై చర్యలు కాదు..! వాస్తవిక కూల్చివేతలు చేపట్టాలని విజ్ఞప్తి..!

గండిమైసమ్మ చౌరస్తాలో.. రెండు వేరువేరు అక్రమ నిర్మాణాలు..

- బౌరంపేట్‌లో వరుస కూల్చివేతలకు అభినందించాల్సిందే..! మరి ఇదేంది సారూ..?
- గచ్చిబౌలి తరహాలో గండిమైసమ్మలో అంతకంటే ప్రమాదకర అక్రమ కట్టడాలు..
- అదనపు అంతస్తులు, జీరో సెట్‌బ్యాకులు, అక్రమ సెల్లార్‌లు..!
- కూల్చివేయకుండా సహకరిస్తున్నారని ఆరోపణలకు బలం చేకూర్చుతున్నారా..?
- బౌరంపేట్‌లో కూల్చివేతలు జరిపామన్న 'నివేదికల'తో తప్పుదోవ పట్టిస్తున్నారా..?
- 'సిఎంసి-హైడ్రా కమిషనర్'..! అవినీతి అధికారుల ప్రక్షాళన లేకపోతే అదోగతే..?
- ముడుపులా..? సిఫార్సులా..? ఇక్కడ చర్యలు విస్మరించి..! అక్కడ షురూ..?
- గెలుపే ఎరుగని నాయకుల సిఫార్సులు..? నామినేటెడ్ పదవితో రికమండేషన్‌లు..?

- తాజా టిఫిన్స్ పక్కన అక్రమ సెల్లార్‌తో, రెసిడెన్షియల్ పర్మిషన్‌తో కమర్షియల్..
- నిరంజన్ కాలనీలో రెండు పర్మిషన్‌లతో ఒకటే వ్యాపారా సముదాయంగా భవనం..
- పోలీస్ స్టేషన్ సమీపంలోనూ రెండు రెసిడెన్షియల్ పర్మిషన్‌లతో కమర్షియల్..
- పెట్రోల్ బంక్ వెనుకవైపు అసలు పర్మిషన్ లేకుండానే భారీ అక్రమ షెడ్డు..
- పిస్తాహౌస్ పక్కన అక్రమ సెల్లార్‌తో రెసిడెన్షియల్ పర్మిషన్‌తో కమర్షియల్..
- బహుదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో జీరో సెట్‌బ్యాకులు, అదనపు అంతస్తులు..
- బహుదూర్‌పల్లి టెక్ మహీంద్రా ఎదురుగా కూల్చిందే మళ్ళీ నిర్మాణం పూర్తి ఎలా..?
- బహుదూర్‌పల్లి చౌరస్తా సమీపంలో 1500 గజాల్లో అక్రమ షెడ్డుపై చర్యలేవి..?
- బౌరంపేట్ సింహపురి కాలనీలో జీరో సెట్‌బ్యాకులు, అదనపు అంతస్తులు..?

అక్రమ నిర్మాణం చిన్నదైనా.. భారీదైనా చట్టం ముందు ఒకటే కావాలి. చర్యలు కూడా అందరికీ ఒకేలా ఉండాలి.. లేదంటే "చట్టం అందరికీ సమానమే" అన్న మాట కేవలం కాగితాలకే పరిమితమవుతుందన్న విమర్శలకు అధికారులే తావిచ్చినట్లవుతుంది.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారుల బరితెగింపు విధులపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.. ఒంటెద్దు పోకడలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తుంటే..! "అంతేగా.. అంతేగా".. అంటూ "ఎఫ్-2 డైలాగ్‌ను తలపించే విధంగా" సర్కిల్ ఉన్నతాధికారి డూడూ బసవన్నలా తలూపుతున్నారని సర్వత్రా వ్యంగ్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి.. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న వైనాన్ని, గచ్చిబౌలి అక్రమ కట్టడాలు నిర్ధారిస్తుండగా, దుండిగల్ సర్కిల్‌లోనూ, భవిష్యత్తు ప్రమాదాలకు సంబంధిత అధికారులే సూత్రదారులుగా వ్యవహరిస్తున్నారాని విమర్శలు వినిపిస్తున్నాయి కీలకపాత్ర పోషిస్తున్నారు.. సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 31:

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సెమీకండక్టర్ తయారీకి తెలంగాణ అనుకూలం

### జీఐబీఏ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ పెన్ పవర్: సెమీకండక్టర్ తయారీ రంగానికి తెలంగాణ అత్యంత అనుకూలమని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా కంపెనీలను ప్రోత్సహించాలని జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ (జీఐబీఏ) ప్రతినిధులను ఆయన కోరారు. రాష్ట్రాన్ని సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కెల్‌స్టర్‌బాక్ నగర మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ నేతృత్వంలో జీఐబీఏ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సెమీకండక్టర్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్, ఆటోమేషన్ తదితర రంగాల్లో పెట్టుబడులకున్న అవకాశాలు, అనుకూలతలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. "జర్మనీ కంపెనీల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రెసిషన్ ఇంజినీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ సామర్థ్యాలను తెలంగాణలోని టాలెంట్ పూల్, ఇండస్ట్రీ ఎకోసిస్టమ్‌తో అనుసంధానం చేయనున్నాం. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 7, 8, 9 తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న

-5లో

# చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్ పెన్ పవర్: చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పెన్షన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఈ నెల 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులను ఆహ్వానించింది. నేటితో గడువు ముగియగా.. దరఖాస్తు చేయని వారు ఇంకా ఉండటంతో వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు.

# బౌరంపేట్ చర్యలు భేష్..! గండిమైసమ్మ సంగతేంటి.?

గ్రీన్ హిల్స్ కాలనీ అదనపు అంతస్తులు, జీరో సెట్‌బ్యాకులు..

జీరో పర్మిషన్‌తో భారీ షెడ్డు నిర్మాణం.. ధర రూ.2.5 లక్షలట..




మార్వాడీకి చెందిన రెండు పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..

ఆధారాలతో వార్తలు ఇలా వచ్చినా చర్యలు నిల్..

## చర్యల్లో ఈ వ్యత్యాసమెందుకు..?

ఒకే సర్కిల్ పరిధిలో కొన్నింటిపై కూల్చివేతలు. మరో నిర్మాణంపై ఉదాసీనతతో చర్యలు తీసుకోకుండా వదిలేయడం ఎందుకు..? నిబంధనలు అందరికీ ఒకేలా వర్తించవా..? బౌరంపేట్‌లో ఒక న్యాయం..?గండిమైసమ్మలో మరో న్యాయమా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అక్రమ నిర్మాణాలపై చర్యలు నిలిచిపోవడానికి ముడుపుల ప్రభావమేనా..? లేక రాజకీయ, అధికార సిఫార్సులా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. అయితే ఇలాంటి ఆరోపణలకు సంబంధించి ఆధారాలను అధికారులు బహిరంగంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. చట్టబద్ధత లేని సిఫార్సులకు అధికారులు తలొగ్గుతున్నారా..? లేక నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నారా..? అన్నది స్పష్టం చేయాల్సి ఉంది..

- 3 పేజి తరువాయి

దుండిగల్ సర్కిల్–59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై వరుస చర్యలు చేపట్టినా..! అధికారుల తీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.. ఒక ప్రాంతంలో జీరో పర్మిషన్ నిర్మాణాలపై కూల్చివేతలు చేపడుతున్న అధికారులు.. మరో ప్రాంతంలో అదే తరహా, అంతకంటే ప్రమాదకర భారీ అక్రమ నిర్మాణాలపై ఎందుకు మౌనం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఇటీవల బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో, 120 గజాల్లో 5 అంతస్తుల అక్రమ నిర్మాణంపై, టౌన్‌ప్లానింగ్ అధికారుల స్టైల్‌లో(తర్వాత ఎలాగో మళ్ళీ నిర్మాణం పూర్తవుతుంది) మొక్కుబడి కూల్చివేతలు చేపట్టగా..! అదే కాలనీలో సోమవారం 110 గజాల్లో జీం3 నిర్మాణం జీరో పర్మిషన్‌తో వెలసిన నిర్మాణానికి కూడా

స్లాబ్‌లకు రంధ్రాలు చేశారు.. ఈ విషయంలో కూల్చివేతలు భేష్ అనాల్సిందే.. అయితే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నామని అధికారులు చూపుతున్నప్పటికీ.. ఓ మాజీ ప్రజాప్రతినిధి సిఫార్సులు చేశాడని ఆరోపణలు వస్తున్నాయి.. రాబోయే ఎన్నికలకోసం తన ఉనికిని చాటుకుంటున్నట్టు స్థానికంగా ఆరోపిస్తున్నారు.. ఏదిఏమైనప్పటికీ అధికార పక్ష నేతలైనా.. విపక్ష నాయకులైనా.. ప్రమాదకర అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని తేటతెల్లం అవుతుంది..

## అధికారులకు సూటి ప్రశ్నలు..

- జీరో పర్మిషన్ నిర్మాణాలపై చర్యల విషయంలో ఒకే సర్కిల్‌లో భిన్న ప్రమాణాలు ఎందుకు..?
- 1,500 గజాల్లో ఉన్న రెండు భారీ షెడ్లపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?
- అక్రమ సెల్లార్లు, అదనపు అంతస్తులపై నోటీసులు ఇచ్చి ఎందుకు వదిలేశారు..??
- కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు తిరిగి మళ్ళీ వెలసినా చర్యలు ఎందుకు లేవు..?
- రెండు వేరువేరు రెసిడెన్షియల్ పర్మిషన్‌లతో
- ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్‌గా, మూడు చోట్ల అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ విభాగం తీసుకున్న చర్యలేవి..?

అపర్ణ టవర్స్ కింద కూల్చేసిన తర్వాతే, ఇలా షెడ్డు పూర్తి.. మతలబ్ ఏంటి..

## అధికారుల ద్వంద్వ వైఖరి..

ఇదే దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మ, బహుదూర్‌పల్లి, సింహపురి కాలనీలో, మరికొన్ని అక్రమ నిర్మాణాల విషయంలో మాత్రం బౌరంపేట్ తరహా దూకుడు కనిపించక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..
ఇదిలా ఉంటే గండిమైసమ్మ ప్రాంతంలో రెండు రెసిడెన్షియల్ అనుమతుల ఆధారంగా ఒకే కమర్షియల్ కాంప్లెక్స్ భవనాలు, మూడు చోట్ల కొనసాగుతున్నాయని, వార్తలు వచ్చినా..? వీటిపై పూర్తిస్థాయి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.. అదేవిధంగా ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు 1,500 గజాల్లో రెండు భారీ అక్రమ షెడ్లు నిర్మించారన్న సమాచారాన్ని పక్కనపెట్టిన దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం.. గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతస్తుల ప్రమాద ఘటనతో..! వివిధ సర్కిల్‌ల అధికారులను అప్రమత్తం చేశారు.. అటు హైడ్రా కమిషనర్, ఇటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..వీటితో పాటు అక్రమ సెల్లార్లు, అనుమతులకు మించి నిర్మించిన అదనపు అంతస్తులు, నోటీసులు ఇచ్చి కూల్చివేసిన తర్వాత కూడా తిరిగి నిర్మాణాలు చేపట్టిన సందర్భాలపై చర్యలు ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు.. మళ్ళీ పూర్తి చేసిన సాక్ష్యం..




నిరంజన్ కాలనీలో రెండు పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..

టెక్ మహీంద్రా ఎదురుగా.. ఈ కూల్చుడేంది.. ఇలా పూర్తి చేసుడేంది సార్..

# శివారులోని గల్లీగల్లీలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో గల్లీగల్లీలోనూ నూతనంగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నందున కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మోడల్ రోడ్లు, స్కై వాక్, జంక్షన్ల అభివృద్ధి, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, వాటర్ డ్రెయిన్స్ నిర్మాణం వంటి వాటితోతోపాటు అభివృద్ధిలో కరీంనగర్ ను తెలుగు రాష్ట్రాల్లోనే ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దబోతున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం గత ఏడేళ్లలో రూ.22 వేల కోట్లకుపైగా నిధులను ఖర్చు చేసినట్లు వివరించారు.
ఈరోజు ఉదయం కరీంనగర్ లోని 45వ డివిజన్ మంకమ్మతోట ఎమ్మెల్సీ
గోపాల్ రావు బిల్డింగ్ సమీపంలో రూ.70 లక్షల యూఐడీఎఫ్ నిధుల అంచనా వ్యయంతో డ్రెయిన్ పైప్ లైన్, సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిసనర్ ప్రపుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లు, పలువురు బీజేపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244

## సెమీకండక్టర్ తయారీకి తెలంగాణ అనుకూలం

-3 పేజి తరువాయి

'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2026'పై జర్మనీ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలి" అని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఐబీఏ ఛైర్మన్ సెల్వకుమార్ పెరియసామి, సీఈవో నిర్మల్ రామన్ కన్నయ్యన్, ఇన్నోవేషన్ హబ్ రైన్‌మెయిన్ సీఈవో స్టెఫాన్ విట్‌కిండ్ట్, ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు కేకే మహేశ్వరి, శ్రీనివాస్ గరిమెళ్ల, వినోద్‌కుమార్ అగర్వాల్, లోకేష్ ఫతేపురియా తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తవ్వకాలు పై రెవెన్యూ అధికారుల దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** కీసర మండలం రాంపల్లి దాయారా సర్వేనెంబర్ 633లో గుట్టుచప్పుడు కాకుండా ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్,+ూా రమాకాంత్ తో కలిసి దాడులు నిర్వహించారు. సెలవ రోజు సైతం రెవెన్యూ అధికారులు దాడి చేసి మూడు లారీలను రెండు జెసిపి 210 హిట్టచీలను సీజ్ చేశారు. ఈ అక్రమ మట్టి తవ్వకాల వేనుక మెట్టు నరసింహ హస్తము ఉన్నట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు.
633 సర్వే నెంబర్లు అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నటువంటి వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చట్టపర్యమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

## ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన

**హుస్నాబాద్: పెన్ పవర్:** హుస్నాబాద్ ఉమ్మాపూర్ లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల బాలుర ,బాలికల హాస్టల్స్ నూతన భవనాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసారు.
ఒక్కో హాస్టల్ కి 7.28 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 14.56 కోట్ల రూపాయల వ్యయంతో హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ బాలుర ఒ బాలికల హాస్టల్ కి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పన్ దండి లక్ష్మీ, వీసీ ఉమేష్ కుమార్ , రిజిస్ట్రార్ , ప్రిన్సిపల్ , కన్సిలర్ లు , మార్కెట్ కమిటీ చైర్మన్ లు , సర్పంచ్ లు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హుస్నాబాద్ కి ఏదైనా యూనివర్సిటీ వస్తే బాగుండు అనే మాట వ్యక్తం చేశారు.. అప్పుడు వెంటనే హుస్నాబాద్ కి ఇంజినీరింగ్ కాలేజీ కావాలని ప్రతిపాదనలు చేశాం. పెద్దపల్లి కి ముఖ్యమంత్రి వచ్చినప్పుడు కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ కి ఎల్ఎల్బి , ఎల్ఎల్ఎం, ఫార్మసీ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ అడగగానే ముఖ్యమంత్రి గారు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు.ముఖ్యమంత్రి ప్రకటించిన కాలేజీ లను పట్టుదలతో మంజూరు చేసుకున్నామని అన్నారు.కేబినెట్ లో ఇంజనీరింగ్ కాలేజీ అప్రూవల్ చేసుకొని, స్థలం అప్రూవల్ చేసుకొని భవనాలకు నిధులు మంజూరు చేసుకున్నాం. ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు శంకుస్థాపన చేసుకున్నాం. ఇప్పుడు హాస్టల్ భవనాలకు శంకుస్థాపన చేసుకున్నాం. మొదటి సంవత్సరంలో 240 మంది విద్యార్థులకు 60 మంది చేరితే సైకిళ్లు ,ల్యాప్ టాప్స్ అందించాం. మంచి నాణ్యమైన విద్య ప్రమాణాలు అందించడం కోసం రాజకీయ జోక్యం లేకుండా చూసుకున్నాం. ఇప్పుడు సెకండ్ ఇయర్స్ లో 120 మంది చేరారు. ఐటీ లో జీరో ఉంటే 175 కి చేరింది.. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్స్ లు తీసుకొస్తాం. వచ్చే విద్యా సంవత్సరం లోపు స్ట్రెంత్ ఫుల్ అవుతుంది. ఇప్పటికే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఈరోజు భవనాలకు శంకుస్థాపన చేసుకున్నాం. కాలేజీ హాస్టల్ లోనే లైబ్రరీ పెట్టిస్తాం.. విద్యార్థులు బాగా చదువుకోవాలి మీకు ఏ సమస్య ఉన్నా స్థానిక ఎమ్మెల్యే గా కాకుండా మీకు గార్డియన్ గా ఉంటా.. త్వరలో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల కు రెండు బస్సులు రాబోతున్నాయి. ఎవరైనా దాన గుణం ఉన్నవారు విద్యార్థులకు ల్యాప్ టాప్ లు ఇవ్వడం..బస్ వచ్చే వరకు ఇంకా ఏదైనా రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్న నని అన్నారు.

## తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి ...

**హైదరాబాద్ పెన్ పవర్:** అలాగే జాతీయ అధ్యక్షులు ఖర్గే పై బీజేపీ పార్టీ వ్యవహరించిన తీరును నిరసిస్తూ మరియు విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించిన ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేసారు.బీజేపీ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ రాష్ట్ర కార్యాలయంకు నల్లరంగులు పూసి నిరసన తెలిపి ఆఫీస్ ఎదుట బీజేపీ పార్టీ జెండాతో పాటు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.నిరసనను పోలీసులు అడ్డుకుని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డితో పాటు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## జోగులాంబ రైల్వే గేట్ వద్ద ఆర్వోబీ నిర్మాణానికి రూ.45 కోట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ప్రఖ్యాత శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తుల రద్దీ నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జోగులాంబ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే గేట్ వద్ద ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు, ఆ గేట్పు ఆర్వోబీ (ROB - Rail Over Bridge) గా మార్చేందుకు రూ. 45 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రకటించారు. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ROB) నిర్మాణం పూర్తయితే భక్తులకు, స్థానికులకు ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తొలగిపోవడంతో పాటు అమ్మవారి దర్శనానికి రాకపోకలు మరింత సులభతరమవుతాయి.

కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం తెలంగాణలో రైల్వేల అభివృద్ధి అంతగా జరగలేదు. అందుకే నరేంద్ర మోదీ గారి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టాం. అందుకే తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నాం. ఈ రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులను కల్పిస్తున్నాం. గత 12 ఏళ్లుగా రైల్వే స్టేషన్లకు సంబంధించి అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు.
2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించక ముందు ఉమ్మడి ఏపీ కోసం ఏడాదిలో రూ.886 కోట్లు ఖర్చు చేసేది. కానీ ఈ ఏడాది కేంద్రప్రభుత్వం సరాసరిగా రూ.5,454 కోట్లు ఖర్చు చేస్తోంది. తెలంగాణలో నూతన రైళ్లు, నూతన రైల్వే ట్రాకులు, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్ పనులను మోదీ ప్రభుత్వం చేస్తోంది.
2009 నుంచి 2014 వరకు 87 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్లు వేశారు. 2014 నుంచి ఇప్పటివరకు 888 కిలోమీటర్ల నూతన లైన్లు వేశారు. తెలంగాణలో 50 వేల కోట్ల విలువైన 21 రైల్వే ప్రాజెక్టులు నడుస్తున్నాయి. గత 10 సంవత్సరాలుగా 520 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, =ఆండర్‌లు నిర్మించాం. ఇంకా 4,883 కోట్లతో 118 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయి. అందులో గద్వాలలో 66కోట్లతో ఒక బ్రిడ్జి మంజూరైంది. మొత్తం 108 కోట్లు గద్వాలలో రైల్వే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రైల్వే ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రప్రభుత్వం, రైల్వే అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అంతేకాకుండా జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో మోదీ ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం తెలంగాణలో 58 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, కార్గో టెర్మినల్స్ నిర్మాణం జరుగుతున్నాయి. తెలంగాణలో కొత్తగా 100కు పైగా కొత్త రైళ్లు తీసుకొచ్చామని అన్నారు. తెలంగాణలో రైల్వే నెట్ వర్క్ సిద్దిపేట లైన్ మినహా దాదాపు విద్యుదీకరణ పూర్తయింది. 174 రైల్వే స్టేషన్లలో హైస్పీడ్ వైఫై సేవలు అందిస్తున్నాం. దేశవ్యాప్తంగా రైల్వే అభివృద్ధిలో భాగంగా తెలంగాణలో 5 వందేభారత్ రైలు సేవలు అందిస్తున్నాయి. వందే భారత్ రైలు గద్వాలలో హాల్టింగ్ విషయంలో ప్రయత్నం చేస్తాం.
కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పూర్తి కానుంది. అంతర్జాతీయ స్థాయిలో కొత్త రైళ్ల ఉత్పత్తి ఇక్కడ జరగనుంది. రైల్వే ప్రమాదాలు నివారించేందుకు కవచ్ సాంకేతికతను తెలంగాణలో అమలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా 7 బుల్లెట్ రైళ్లను ప్రకటించగా, అందులో 3 రైళ్లు తెలంగాణకు ఇచ్చారు.దీన్ని బట్టి నరేంద్రమోదీ గారి ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిపై దృష్టి సారించిందనేది అర్థం చేసుకోవచ్చు. హైస్పీడ్ రైల్ ఎలివేటెడ్ కారిడార్ వస్తే హైదరాబాద్ నుంచి చెన్నై వంటి నగరాలకు చాలా వేగంగా చేరుకోవచ్చు. బుల్లెట్ రైలు వస్తే తెలంగాణలో అభివృద్ధి పెరుగుతుంది. పరిశ్రమలు, పర్యాటకులు పెరుగుతారు. బుల్లెట్ రైలు ఒక గేమ్ చేంజర్.
జిల్లా కేంద్రమైన గద్వాలకు రైలు కనెక్టివిటీ మరింత పెంచుతాం. 34 రైళ్లు ఈ స్టేషన్ నుంచి వెళ్తుంటాయి. రైల్వే అభివృద్ధి పూర్తయ్యాక మరిన్ని రైళ్లు ఆపే అవకాశం ఉంది. విమానాశ్రయం తరహాలో రైల్వే ప్లాట్ ఫాం అభివృద్ధి జరుగుతోంది. లిఫ్టులు, ఎస్కలేటర్లు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నాం. 2027 ఏప్రిల్ లోపు గద్వాల రైల్వే స్టేషన్ పనులు పూర్తికానున్నాయి. గద్వాలరైల్వే స్టేషన్ ప్రారంభించి 100 ఏళ్లు కావొస్తుంది. రైల్వే పనులు పూర్తయ్యాక వందేళ్ల పండుగను కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొందామని అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భారీ కుంభకోణం ఉంది

**హైదరాబాద్ పెన్ పవర్:** వంద రోజులో ఆరు గ్యారెంటీలు 420 సంక్షేమ పథకాలు అందిస్తామని వెయ్యి రోజులైనా ఏమీ జరగలేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి గద్దెనెక్కరు. నాలుగు వేల పెన్షన్లు, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని తెలంగాణ ప్రజలను మోసం చేశారు. వంద రోజుల్లో సంక్షేమ పథకాలు అందిస్తామని వెయ్యి రోజులైనా జాడ లేదు. బిఆర్ఎస్ పార్టీ అధినేత పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుండి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుపుతున్నామని అన్నారు.
కేసీఆర్ శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకు రంగులు వేసుకుంటూ రిబ్బన్లు కట్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి . కెసిఆర్ ప్రభుత్వంలో నిరుపేదలకు ఉచితంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఏమో 5 లక్షల రూపాయలు కడితే ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని అంటున్నారు. నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లకు ఐదు లక్షల రూపాయలు కట్టగలరా..? ఒకే ఇంట్లో భార్యకు డబల్ బెడ్ రూం వస్తే భర్తకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా కేటాయించారు. ఒకే ఇంట్లో ఇద్దరికి ఇండ్లు ఎలా కేటాయిస్తారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భారీ కుంభకోణం ఉంది. ప్రజలకు మరోసారి మోసం చేయడానికి రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధం అయింది. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన పెన్షన్లు ,తులం బంగారం బాకీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలి. అబద్దాల హామీలతో గద్దెనెక్కినటువంటి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇందిరమ్మ ఇండ్లలో స్థానిక ఎమ్మెల్యేను పిలవకుండానే లాటరీ తీస్తున్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎమ్మెల్యేలను ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఇచ్చేవరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు.

## హైదరాబాద్‌లో స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా 2026 ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. హైటెక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో తయారీదారులు, ప్రముఖ బ్రాండ్లు, డిస్ట్రిబ్యూటర్లు, పరిశ్రమ నిపుణులు, స్పోర్ట్స్ కమ్యూనిటీలు, వినియోగదారులు ఒకే వేదికపైకి వచ్చారు. ఈ 9వ ఎడిషన్ స్పోర్ట్ ఎగ్జిబిషన్‌ను హైటెక్స్ డైరెక్టర్ కున శంకర్, ఎన్ఎండీసీ డైరెక్టర్ పర్సనల్ కృష్ణ కుమార్ ఠాకూర్ , హైదరాబాద్ రన్నర్స్ రేస్ డైరెక్టర్ రాజేష్ వెచ్చ కలిసి ప్రారంభించారు.స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా 2026లో 50కి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. స్పోర్ట్స్, ఫిట్‌నెస్, న్యూట్రిషన్, వెల్‌నెస్ విభాగాలకు సంబంధించిన ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించడంతో పాటు లైవ్ స్పోర్ట్స్ టోర్నమెంట్లు, వివిధ క్రీడా పోటీలు, డెమోన్స్ట్రేషన్లు, ఇంటరాక్టివ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మీడియాతో హైటెక్స్ డైరెక్టర్ కున శంకర్ మాట్లాడుతూ.. స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా క్రీడా రంగంలోని బ్రాండ్లు, వినియోగదారులు నేరుగా అనుసంధానం అయ్యే వేదికగా అభివృద్ధి చెందుతోందన్నారు. క్రీడాకారులు, కోచ్‌లు, ఫిట్‌నెస్ ఔత్సాహికులు, పరిశ్రమ నిపుణులు పరస్పరం కలుసుకుని, ఆలోచనలు పంచుకోవడంతో పాటు కొత్త ఉత్పత్తులు, ఆవిష్కరణలను ఈ ఎక్స్‌పో కల్పిస్తోందని తెలిపారు.
క్రీడలకు పూర్తిగా అంకితమైన వేదికగా స్పోర్ట్ ఎక్స్‌పోను రూపొందించాం. ప్రతి సంవత్సరం క్రీడాకారులు, నిపుణులు, బ్రాండ్లు, సంస్థలు, క్రీడాభిమానులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నాం. స్పోర్ట్ ఎక్స్‌పో కేవలం ఉత్పత్తుల
ప్రదర్శనకే పరిమితం కాకుండా, పోటీలు, డెమోన్స్ట్రేషన్లు, సెమినార్లు వంటి కార్యక్రమాలు కొనసాగుతాయని కున శంకర్ తెలిపారు.
హైదరాబాద్ మారథాన్‌కు కర్టెన్ రైజర్‌గా స్పోర్ట్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, దేశంలో రెండో అతిపెద్ద మారథాన్‌గా పేరొందిన హైదరాబాద్ మారథాన్‌కు 25,000 మందికి పైగా సందర్శకులను ఈ వేదిక ఆకర్షిస్తోందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌ను ప్రముఖ క్రీడా, ఫిట్‌నెస్ ఈవెంట్లకు వేదికగా మరింత బలోపేతం చేయడంలో స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా 2026 కీలకంగా నిలుస్తుందన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులతో విద్యార్థి సేన ధర్నా

**హైదరాబాద్ పెన్ పవర్:** షాద్‌నగర్ ముఖ్య కూడలిలో విద్యార్థి సేన ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు జీఓ నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి సేన అధ్యక్షుడు టి.కె. శివ ప్రసాద్ మాట్లాడుతూ.. జీఓ నంబర్ 97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. మూడు సంవత్సరాల పాటు విద్యార్థులు ఎంతో కష్టపడి సాంకేతిక నైపుణ్యాలను అభ్యసించారని, వారి భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు.పాలిటెక్నిక్ విద్యపై ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసినట్లు చెబుతున్నప్పుడు, ఇదే అంశంపై ముందుగానే కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థుల అభిప్రాయాలను ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం లేదని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థుల భవిష్యత్తుపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే జీఓ నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని శివకుమార్ డిమాండ్ చేశారు. జీఓను రద్దు చేయకపోతే విద్యార్థి సేన ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, వారి భవిష్యత్తుకు నష్టం కలగకుండా తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## మేడిపల్లిలో నలుగురు దొంగల హల్ చల్

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ జిల్లా మేడిపల్లి పిఎస్ పరిధిలోని పీర్జాదిగూడ బీపీఎం (గ్రీన్వుడ్) కాలనీలో అర్ధరాత్రి నలుగురు దొంగలు సంచరించారు. కాలనీలో చాలాసేపు తిరుగుతూ చోరీకి విఫలయత్నం చేశారు. మొదట ఓ ఇంట్లోకి ప్రవేశించిన దొంగలకు అక్కడ ఏమీ లభించకపోవడంతో పక్కనే ఉన్న మరో ఇంట్లోకి గోడ దూకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన మహిళ గట్టిగా కేకలు వేయడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. నలుగురు అనుమానితులు కాలనీలో సంచరిస్తూ చోరీకి యత్నించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఘటనపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు.

# కరాటేతోనే ఆత్మరక్షణ, అద్భుత మానసిక వికాసం గ్రాండ్ మాస్టర్ జి. విట్టల్

## ఘనంగా ముగిసిన ' యోధ గోజ్యూరు' కరాటే బెల్ట్ ప్రదానోత్స

## వంమార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలతో అదరగొట్టిన క్రీడాకారులు

**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగస్టు31:** నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, శారీరక, మానసిక దృఢత్వానికి తోడ్పడే క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ కరాటే గ్రాండ్ మాస్టర్ జి. విట్టల్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా కరాటే సాధన ద్వారా స్వయం రక్షణ (ఆత్మరక్షణ) లభించడంతో పాటు శారీరక దృఢత్వం, తిరుగులేని క్రమశిక్షణ మరియు అద్భుత మానసిక వికాసం సిద్ధిస్తాయని ఆయన స్పష్టం చేశారు. నగరంలో 'యోధ గోజ్యూరు కరాటే డు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కరాటే బెల్ట్ పరీక్షలు ఆదివారం అత్యంత ఉత్సాహభరిత, క్రమశిక్షణా వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. సీనియర్ కరాటే మాస్టర్ డి. కిరణ్ కుమార్ పర్యవేక్షణలో సుదీర్ఘకాలంగా కఠిన శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు ఈ పరీక్షల్లో పాల్గొని, తమ అద్భుత మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలను, సాహసోపేత విన్యాసాలను ప్రదర్శించి అక్కడికి వచ్చిన సభ్యులను అబ్బురపరిచారు. ఈ వేడుకకు యోధ గోజ్యూరు స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా గ్రాండ్ మాస్టర్ జి. విట్టల్ ముఖ్య అతిథిగా విచ్చేసి, పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు కలర్ బెల్టులు మరియు ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్లను) అందజేసి అభినందించారు. ఈ విశేష కార్యక్రమంలో మాస్టర్ ఆర్. విజయ్ కుమార్, మాస్టర్ పి. కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 100 ఎకరాల్లో ఇంటర్నేషనల్ స్టేడియం

**హైదరాబాద్, ఆగస్టు 31, పెన్ పవర్:** హైదరాబాద్ క్రీడా రంగంలో మరో భారీ ప్రాజెక్ట్‌కు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ స్టేడియంలో 1.32 లక్షలకుపైగా ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉండేలా ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా ఉన్న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంతో పోటీ పడనుంది.ఈ భారీ స్టేడియాన్ని రంగారెడ్డి జిల్లాలోని ముచ్చెర్ల సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో హైదరాబాద్‌కు కీలక పట్టణ విస్తరణ కేంద్రంగా మారనున్న ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే ప్రణాళికల్లో భాగంగా ఈ స్టేడియాన్ని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ప్రధాన రహదారి మార్గాలతో అనుసంధానం ఉండేలా ప్రాజెక్ట్‌ను రూపొందించనున్నారు. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సులభంగా చేరుకునే విధంగా కనెక్టివిటీని అభివృద్ధి చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.స్టేడియం నిర్మాణానికి సంబంధించిన పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్‌లో శంకుస్థాపన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే తుది తేదీ, నిర్మాణ సంస్థ, పూర్తి ప్రాజెక్ట్ షెడ్యూల్ వంటి అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం తెలంగాణ ప్రభుత్వం భూమిని సమకూర్చనుండగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్మాణం, నిర్వహణకు నిధులు సమకూర్చే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. ఈ మోడల్‌పై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. క్రికెట్ స్టేడియంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో మరిన్ని క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. భారీ అంతర్జాతీయ మ్యాచ్‌లు, క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించగల సామర్థ్యంతో స్టేడియం ఏర్పడితే హైదరాబాద్‌కు క్రీడా పర్యాటకం, అంతర్జాతీయ ఈవెంట్ల పరంగా మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉంది.

# కొండా, కోమటిరెడ్డికి గులాబీ భరోసా

**హైదరాబాద్ ఆగస్టు 31 పెన్ పవర్:** రేవంత్ రెడ్డి వచ్చేదాకా కాంగ్రెస్ పార్టీ సరైన సవాల్ కెసిఆర్ కు విసర లేకపోయింది. కెసిఆర్ కొడుతుంటే పడింది. కెసిఆర్ తిడుతుంటే పడింది. కెసిఆర్ తొక్కుతుంటే పాతాళం దాకా వెళ్ళిపోయింది. అంతేతప్ప కేసీఆర్ కు కౌంటర్ ఇచ్చే సాహసం కాంగ్రెస్ పార్టీ చేయలేకపోయింది.తెలంగాణ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో రెండు పర్యాయాలు అధికారంలోకి రాలేకపోయింది అంటే ఆ పార్టీలో నాయకత్వ లోపం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరికి రేవంత్ రెడ్డి వచ్చేదాకా కాంగ్రెస్ పార్టీలో నిస్తేజం అలానే ఉందంటే.. ఆ పార్టీలో నాయకత్వం ఎంత దారుణంగా ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా వచ్చిన తర్వాత ఒకసారిగా పార్టీ పరిస్థితి మారిపోయింది. కెసిఆర్ కు సవాల్ కాదు.. కెసిఆర్ పీఠాన్ని పక్కకు జరిపి చూపించాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డికి బయట పల్లకి మోత ఉన్నప్పటికీ.. ఇంట్లో మాత్రం ఈగల మోత ఉంది. అదే అతడికి ఇప్పుడు ఇబ్బందికరంగా మారింది.మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి తరఫున కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోటీ చేసినప్పుడు ఆయనకు వ్యతిరేకంగా గులాబీ మీడియా బీభత్సంగా కథనాలు ప్రసారం చేసింది. కేవలం బొగ్గు కాంట్రాక్టు కోసమే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బిజెపిలో చేరారని ఆరోపణలు చేసింది. ఆ విషయాన్ని ఎన్నికలకు ముందు విపరీతంగా ప్రచారం చేసింది. తద్వారా మునుగోడు ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీ కమ్యూనిస్టుల సహాయంతో విజయం సాధించింది.నాడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వ్యతిరేకంగా రాసిన నమస్తే తెలంగాణ.. వ్యతిరేకంగా వార్తలు ప్రసారం చేసిన టీ న్యూస్ కు ఇప్పుడు హఠాత్తుగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గొప్పవాడిగా మారిపోయాడు. ఆ పత్రికలో.. ఆ చానల్లో రాజగోపాల్ రెడ్డికి విపరీతమైన ప్రయారిటీ లభిస్తుంది. దీనికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని అతడు పరోక్షంగా విమర్శిస్తూ ఉండడమే.. అందువల్లే ఆ పత్రికకు రాజగోపాల్ రెడ్డి ఇప్పుడు అత్యంత ఆప్తుడిగా మారిపోయాడు. నమస్తే తెలంగాణ అంటే.. టీ న్యూస్ అంటే మరి ఏదో కాదు.. అవి పరోక్షంగా కేసీఆర్ మానస పుత్రికలు. కెసిఆర్ మానస పుత్రికల లాంటి మీడియాలో వార్తలు వచ్చాయంటే.. కచ్చితంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కేసిఆర్ కు ఇప్పుడు అత్యంత ఆప్తుడు.ఆమధ్య సినీ నటుడు నాగార్జున పెద్ద కుమారుడు నాగచైతన్య విడాకుల విషయంలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు గులాబీ మీడియా విపరీతమైన ప్రయారిటీ ఇచ్చింది. సురేఖ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకుంటూ కథనాలను పబ్లిష్ చేసింది. చివరికి కేటీఆర్ కూడా సురేఖ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. సురేఖ కుమార్తె ఇటీవల ముఖ్యమంత్రి మీద విమర్శలు చేయడంతో హఠాత్తుగా గులాబీ మీడియాకు కొండా సురేఖ బీసీ నాయకురాలుగా కనిపిస్తోంది. బీసీ నాయకురాలి మీద కుట్ర అంటూ వార్తలను పబ్లిష్ చేస్తోంది. ద్వంద్వ ప్రమాణాల గులాబీ పాత్రికేయాన్ని బయటపడుతోంది. ఇంత జరుగుతున్నప్పటికీ గులాబీ పార్టీ మీడియా సెల్ఫ్ కుక్ డ్ వార్తల మీద కాంగ్రెస్ శ్రేణులు కౌంటర్ ఇవ్వకపోవడం నిజంగా ఆ పార్టీ భావ దారిద్ర్యం..

# మీడియా మొఘల్ కి కష్టాలు...

**హైదరాబాద్ పెన్ పవర్:** జీ, ఎస్సెల్ గ్రూప్ సంస్థల ఫౌండర్ సుభాష్ చంద్ర దివాలా తీశారు. తన వద్ద రూపాయి కూడా లేదని అంటున్నారు. ఆయన సాధారణ బిజినెస్ మెన్ కాదు. మరి ఎలా దివాలా తీశారు..? భారతీయ బిజినెస్ ప్రపంచంలో సుభాష్ చంద్ర ప్రయాణం ఒక అద్భుతమైన రోలర్‌కోస్టర్ రైడ్ లాంటిది. 1969లో 17 ఏళ్ల వయసులో కుటుంబం ఎదుర్కొన్న రూ. 3.5 లక్షల అప్పుల భారంతో చదువు ఆపేసిన ఆయన, శూన్యం నుంచి వేల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించారు. 1992లో దూరదర్శన్ మాత్రమే ఉన్న కాలంలో, భారతదేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ శాటిలైట్ ఛానెల్ జీ టీవీ ను ప్రారంభించి భారత మీడియా మొఘల్ గా అవతరించారు. ఎస్సెల్ ప్యాకేజింగ్, ఎస్సెల్ వరల్డ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ , జీ మీడియా ద్వారా ఆయన బహుముఖ వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించారు.అయితే, ఆయన సాధించిన అపారమైన విజయం వెనుక అపరిమితమైన అప్పులు అనే బిజినెస్ ప్రమాదం పొంచి ఉండిపోయింది. మీడియా రంగంలో విజయం సాధించిన తర్వాత, సుభాష్

చంద్ర తన వ్యాపారాన్ని మౌలిక సదుపాయాల , ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు, సోలార్ పవర్, రోడ్లు, డిష్ టీవీ విస్తరణ , డిజిటల్ నెట్‌వర్క్‌ల వైపు విస్తరించారు. ఎస్సెల్ గ్రూప్ ద్వారా భారీ ఇన్ఫ్రా ప్రాజెక్టుల కోసం బ్యాంకుల నుంచి, మ్యూచువల్ ఫండ్స్ నుంచి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నారు.ఈ అప్పులే ఆయన సామ్రాజ్యానికి మొదటి గొడ్డలిపెట్టుగా మారాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ , సోలార్ ప్రాజెక్టులలో అనుకున్నంత ఆదాయం రాకపోవడం, ఊహించని రీతిలో ప్రాజెక్టులు ఆలస్యం కావడం వల్ల గ్రూప్ తీవ్ర నగదు కొరత లో కూరుకుపోయింది. ప్రాజెక్టుల నుంచి వచ్చే రాబడితో అప్పుల వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు, తాను తీసుకున్న రుణాలకు సుభాష్ చంద్ర తన సొంత జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లను ఈక్యూటీగా తాకట్టు పెట్టడం అతిపెద్ద వ్యూహాత్మక పొరపాటైందిఅప్పులు తీర్చలేకపోవడంతో 2019 నుంచి రుణదాతలు తాకట్టులో ఉన్న జీ టీవీ షేర్లను విక్రయించడం ప్రారంభించారు. దీంతో ఎస్సెల్ గ్రూప్ తన ప్రధాన వ్యాపారమైన జీ టీవీలో మెజారిటీ వాటాను కోల్పోవలసి వచ్చింది. వందల కోట్ల అప్పులు తీర్చేందుకు ఆయన డిష్ టీవీ, పవర్ ప్లాంట్లు, మీడియా వాటాలను విక్రయించాల్సి వచ్చింది. అయినప్పటికీ, దాదాపు రూ. 22,000 కోట్లకు పైగా రుణాలకు సంబంధించి వ్యక్తిగత పూచీకత్తులు ఇవ్వడంతో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ లో ఆయనపై వ్యక్తిగత దివాలా ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. సొంత వ్యాపారాలు మినహా ఇతర ప్రమాదకర రంగాల్లోకి అప్పులతో అడుగుపెట్టడం, వ్యక్తిగత పూచీకత్తులతో షేర్లను తాకట్టు పెట్టడం ఏ స్థాయిలో ఉన్న వ్యాపారవేత్తనైనా ఎలా కోలుకోలేని దెబ్బతీస్తుందనే దానికి సుభాష్ చంద్ర ప్రయాణం ఒక నిదర్శనం.

# మండల సమస్యలపై ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సిపిఎం అందోళన

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 31:** గార్ల పెద్ద చెరువులో ఆక్రమణకు గురవుతున్నాయని, వెంటనే ఆక్రమణకు గురవుతున్న సీతంపేట పెద్ద చెరువు శిఖం భూములను వెలికి తీయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి లు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో ఫిల్టర్ బెడ్ మరమ్మతులు చేపట్టి పట్టణ ప్రజలకు త్రాగునీరును అందించాలని డిమాండ్ చేశారు.మండలం లో కోతులు, వీధి కుక్కల నివారణ చర్యలు చేపట్టి రైతులు,ప్రజలను కాపాడాలని కోరారు. గోపాలపురంలో స్మశాన వాటికకు రహదారి, పినిరెడ్డిగూడెం క్రాస్ రోడ్ నుండి బాలాజీ తండా వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, గార్ల 1-5 వార్డులకు స్మశాన వాటిక నిర్మాణం చేపట్టాలని, నగరంలో అంతర్గత రోడ్లు,నగరం,పినిరెడ్డిగూడెంలో సీసీ రోడ్లు,అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, నగరం నుండి నామలపాడు వరకు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.అర్హులైన వారికి ఆసరా పెన్షన్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు, సంబంధిత అధికారులకు అందజేశార. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.పి వెంకటేశ్వర్లు, ఐ.గోవింద్, సిహెచ్ బాబు,కె.రామకృష్ణ,ఎస్. కె. మౌలానా, ఎస్. కె. బాజీ, జి. వీరభద్రం,వి.ఇస్తారి,కోటయ్య,టీ. నాగేశ్వరావు,సంపత్, రమేష్, శ్యామ్,ఉపేందర్, లక్ష్మి,వెంకటేష్, కుమార్, రాజేష్,కార్యకర్తలు ఉన్నారు

# రైతులకు ఆధునిక సేద్యంపై శిక్షణ

మాట్లాడుతున్న కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ దిలీప్ కుమార్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 31:** ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని మల్యాల కె.వి.కె కోఆర్డినేటర్ డాక్టర్ దిలీప్ కుమార్ అన్నారు గార్ల మండల పరిధిలోని ముల్కనూరు గ్రామ రైతు వేదికలో సోమవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో తక్కువ నీరు తక్కువ పెట్టుబడితో స్థిరమైన ఆదాయం పొందే వ్యవసాయ విధానాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో రైతులు నీటి పొదుపు పద్ధతులు పంటల వైవిద్యేకరణ తక్కువ పెట్టుబడి సాగు విధానాలు అవలంబించాలని సూచించారు సమగ్ర పోషక యాజమాన్యం సమగ్ర సస్యరక్షణ సేంద్రియ జీవన ఎరువుల వినియోగం చేపట్టాలని రైతులు ఒకే పంట పై ఆధారపడకుండా పంటల మార్పిడి అంతర పంటలు ఉద్యాన పంటలు అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలు చేపట్టడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చు అన్నారు నీటి వినియోగం తగ్గించేందుకు డ్రిప్స్ స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటి పద్ధతులను వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.వికే శాస్త్రవేత్త సుహాసిని ఇరిగేషన్ అధికారి భరత్ మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు విస్తరణ అధికారులు పూజిత మేఘన రైతులు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరభేరి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరి ప్రియ నాయక్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 31:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సమరభేరికి సిద్ధం కావాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలపై గార్ల మండల కేంద్రంలోని స్థానిక వర్తక సంఘం భవనంలో ముఖ్య కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ శ్రేణుల భాగస్వామ్యంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు అయినా అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించేలా నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోఫ్యాక్స్ చైర్మన్ లక్కినేని సురేందర్ శీలంశెట్టి రమేష్ బుడగ మురళి ఎండి ఖదీర్ రాందాస్ బాలు హరిలాల్ మర్రిగూడెం వెంకటేశ్వర స్వామి మాజీ చైర్మన్ అమరచంద్ శ్రీనాథ్ అనీల్ పాషా వెంకటేష్ విజయ్ జాకు రాములు ఉమేష్ దేశపాక మురళి నరసింహ నునావత్ నరసింహ, ఉపేందర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓల్డ్ సిటీలో మెట్రో అడుగులు...

# 833 స్థలాల స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 31, పెన్ పవర్:** హైదరాబాద్ పాతనగరం మెట్రో విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎచ్ఎమ్ఆర్ఎల్, హెచ్ఏఎమ్ఎల్ అదనపు ఎండీ బి.అజిత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దారుషిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. మొత్తం 888 ప్రభావిత ఆస్తుల్లో 833 ఇప్పటికే స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 55 ఆస్తుల్లో ఉన్న వారసత్వ, పురాతన భవనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. విద్యుత్, నీటి పైపులు తదితర యుటిలిటీల తరలింపును, ఆస్తుల తొలగింపును వేగవంతం చేసి త్వరగా ఆర్వోడబ్ల్యూ అందుబాటులోకి తేవాలని సూచించారు.హైదరాబాద్ పాతనగరం మెట్రో రైలు విస్తరణ పనులనుమరింత వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. మెట్రో కారిడార్ నిర్మాణానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి భూసేకరణ, ఆస్తుల తొలగింపు, యుటిలిటీల తరలింపు పనులను త్వరగా పూర్తి చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ( ఎచ్ఎమ్ఆర్ఎల్ ), హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ( హెచ్ఏఎమ్ఎల్ ) అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి ఆదేశించారు. ఇవాళ ఆయన ఓల్డ్‌సిటీలో దారుషిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెట్రో రైల్ చీఫ్ ఇంజినీర్ ఎస్.భాస్కర్‌రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కారిడార్ అభివృద్ధికి మొత్తం 888 ప్రభావిత ఆస్తులను గుర్తించగా.. ఇప్పటివరకు 833 ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వివరించారు. మిగిలిన 55 ఆస్తులకు సంబంధించి వారసత్వ కట్టడాలు, పురాతన భవనాలు ఉండటంతో వాటి విషయంలో తీసుకుంటున్న చర్యలపై అజిత్‌రెడ్డి సమీక్షించారు. చారిత్రక నిర్మాణాలకు ఇబ్బంది కలగకుండా, మెట్రో పనులకు అవసరమైన మార్గాన్ని సిద్ధం చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలను పరిశీలించాలని సూచించారు. మెట్రో కారిడార్‌లో విద్యుత్ తీగలు, స్తంభాలు, వాటర్ వర్క్స్ పైప్‌లైన్లు తదితర యుటిలిటీలు పనులకు అడ్డంకిగా మారకుండా వాటిని సురక్షితంగా తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు ఎండీ ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో ప్రభావిత ఆస్తుల తొలగింపును కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు.పాతనగరం మెట్రో పనులను వేగంగా పూర్తిచేసి స్థానిక ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యం అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలను అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలని అజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో పనులకు స్థానిక ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోందని, వారు తమవంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. కారిడార్‌కు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి త్వరితగతిన రైట్ ఆఫ్ వే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భూసేకరణలో ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు కృషి చేసిన రెవెన్యూ అధికారులను ఆయన అభినందించారు. త్వరలోనే మిగిలిన భూసేకరణ పూర్తి చేసి ప్రాజెక్టును పట్టాలెక్కించాలని అన్నారు

# నిమ్మ ధరలు... పైపైకి...

**హైదరాబాద్, ఆగస్టు 31, పెన్ పవర్:** పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరల భారం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే వంట నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులు ధరలు భారీగా పెరగ్గా.. చక్కెర, ఉల్లిపాయల ధరలు కూడా పెరిగాయి.. తాజాగా.. ఈ బాటలో నిమ్మకాయ కూడా చేరింది. నిమ్మ ధరలుసైతం ఒక్కసారిగా పెరిగాయి.తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ మార్కెట్లో ఉల్లి, పంచదార ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో రోజువారీ కిరాణాల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. గతంలో కిలో రూ.25 నుంచి రూ.35 మధ్య లభించిన ఉల్లిపాయలు.. ప్రస్తుతం.. కిలో రూ.55 నుంచి రూ.70 వరకు చేరింది. అలాగే చెక్కర ధర కూడా పెరిగింది. గతంలో కిలో చెక్కర రూ.45 నుంచి రూ.48 వరకు ఉండగా.. ప్రస్తుతం కిలో చెక్కర రూ. 65 నుంచి రూ. 70కి పెరిగింది. ఇదేబాటలో నిమ్మకాయ కూడా చేరింది. నిమ్మకాయ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి.ఎకనామిక్స్ ఆన్‌లైన్ కోర్సులు ఎంచుకోవడంనిమ్మకాయల ధరలకు రెక్కలొచ్చాయి. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడులు తగ్గడం, మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగాయి. ఏప్రిల్, మే నెలల్లో డజను ధర రూ. 100 పలికింది. జూన్, జులై నెలల్లో రూ.30 నుంచి రూ. 40వరకు చేరింది. అయితే, నాలుగైదు రోజుల నుంచి నిమ్మ ధర రికార్డు స్థాయిలో పెరగడమే కాకుండా ఏకంగా డజను రూ. 120కు చేరడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరగడంతో అల్లాడుతున్న వినియోగదారునికి ఆకాశాన్నంటుతున్న నిమ్మ ధరలు శరాఘాతంగా మారాయి.

# 40 కోట్ల టెండర్ కు రెండున్నర కోట్ల అమ్యామ్యాలు...

**హైదరాబాద్, ఆగస్టు 31, పెన్ పవర్:**
వడ్డించేవాడు మనవాడు అయితే బంతిలో ఎక్కడ కూర్చున్న పర్వాలేదు. ఈ సామెతను గడిచిన కొన్ని సంవత్సరాలుగా మహిళ ఐఏఎస్ అధికారి నిజం చేసి చూపిస్తున్నారు. చూపించడమే కాదు దర్జాగా కోట్లను తన ఖాతాలో వేసుకుంటున్నారు. ఇదంతా కూడా వాట్సప్ కాల్ ద్వారా ఆమె చేసి చూపిస్తున్నారు.గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ శాఖలో ఆ మహిళా అధికారి కీలకంగా ఉండేవారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుపొందిన జిల్లాకు కలెక్టర్ గా వ్యవహరించారు. ఆ తర్వాత ఆమె ఒక శాఖలో కీలక అధికారిగా పనిచేస్తున్నారు. ఈ శాఖలో రకరకాల అభివృద్ధి పనులు జరుగుతూ ఉంటాయి. గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒక సంస్థకు ఆమె కాంట్రాక్టు కట్టబెట్టారు. ఏకంగా 40 కోట్ల టెండర్ ఆ సంస్థకు అందే విధంగా చూశారు. అప్పటినుంచి ఆ సంస్థ ఆధిపతులకు.. ఆ మహిళ ఐఏఎస్ అధికారికి ఫెవికాల్ సంబంధం ఏర్పడింది. ఆ అధికారికి.. కంపెనీకి మధ్య వ్యవహారాలు చక్కబెట్టడానికి ఒక ఏడి స్థాయి అధికారి పనిచేసేవారు. గులాబి పార్టీ.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ.. అధికారంలో ఎవరు ఉన్నా సరే ఆ శాఖకు సంబంధించిన కాంట్రాక్ట్ మొత్తం ఆ కంపెనీకి దక్కుతుంది. పైగా ఎటువంటి నిబంధనలు పాటించే అవకాశం లేకుండానే ఆ మహిళా అధికారి ఆ సంస్థకు టెండర్ దక్కే విధంగా చూస్తుంటారు.ప్రభుత్వ మారినప్పటికీ.. అధికారులు మారినప్పటికీ ఆ మహిళ ఐఏఎస్ అధికారి మాత్రం ఆ శాఖలోనే ఉంటారు. పైగా ఆ కంపెనీకి మాత్రమే కాంట్రాక్ట్ దక్కే విధంగా చూస్తుంటారు. ఇలా కాంట్రాక్ట్ దక్కేలా చూసినందుకు ఆ కంపెనీ ఆ మహిళా అధికారికి ఏకంగా 2.5 కోట్లు చెల్లించినట్టు తెలుస్తోంది. రెండు విడతలుగా అది కూడా నగదు రూపంలో ఆ మహిళ అధికారికి ఆ కంపెనీ నిర్వాహకులు ఇచ్చినట్టు సమాచారం. అయితే ఇదంతా కూడా కేవలం వాట్సాప్ కాల్ ద్వారా జరిగిపోవడం మరింత విశేషం. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ. ఆ మహిళా అధికారి ఆ శాఖలో ఉంటుంటారు. ఆమెను బదిలీ చేసే సాహసం ఏ ప్రభుత్వం కూడా చేయదు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతిని రూపుమాపడానికి ప్రయత్నాలు చేస్తోంది. అవినీతి అధికారులను అరెస్ట్ చేయిస్తుంది. వారి ఆస్తులను బయటపెడుతున్నది. అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నది. అయినప్పటికీ ఇటువంటి మహిళా అధికారులు ఏమాత్రం భయం లేకుండా సంపాదిస్తున్నారు అంటే వారి వెనుక బలమైన అండ ఉందని అర్థం. మరి ఇటువంటి అండలను ఏ విధంగా తొలగిస్తారు.. అవినీతి అధికారులను ఏ విధంగా శిక్షిస్తారు అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలని విశ్లేషకులు అంటున్నారు.

## బాలికపై ఎమ్మెల్సీ దారుణం... బేగ్ పై చర్యకు దిగిన ఎంఐఎం పార్టీ

**హైదరాబాద్, ఆగస్టు 31, పెన్ పవర్:** ఇటీవల హిజాబ్ గురించి ఒక కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. దానిపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు.. ఇది మా గౌరవంతో కోర్టు ఆట ఆడుకోవడమేనని స్పష్టం చేశారు. కోర్టు తీర్పును తాము అంగీకరించబోమని వివరించారు. ఆడవాళ్ళ పట్ల గౌరవంగా ఉండాలని నీతి సూక్తులు చెప్పారు.పైకి ఎన్ని గొప్ప మాటలు చెప్పినప్పటికీ ఓవైసీ పార్టీలో ఆడవాళ్లపై జరుగుతున్న అకృత్యాలు వెలుగులోకి వస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. చివరికి ఆ పార్టీకి సంబంధించిన ఒక ఎమ్మెల్సీ ఒక బాలిక మీద వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఈ ఘటన వెలుగులోకి రావడంతో అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. ఎంఐఎంలో ఎమ్మెల్సీగా కొనసాగుతున్న మీర్జా రహమత్ బేగ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. అత్తాపూర్ ప్రాంతంలో బేగ్ ఓ బాలిక మీద చేయకూడని పనిచేస్తుండగా కొందరు యువకులు పట్టుకున్నారు. తీవ్రంగా కొట్టారు. వీడియోలు కూడా తీశారు. ఈ విషయం ఓవైసీకి ముందే తెలుసని.. అందువల్లనే బేగ్ ను ఉమ్రా పంపించారు. వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యేసరికి ఎటువంటి కారణం చూపించకుండానే సస్పెండ్ చేశారు.. మీర్జా రహమత్ బేగ్ పై సస్పెన్షన్ పై ఓల్డ్ సిటీ జర్నలిస్టులు స్పందిస్తున్నారు. అందులో ప్రధానంగా ఓల్డ్ సిటీ జర్నలిస్టు సయ్యద్ అలీ కీలక వ్యాఖ్యలు చేశారు.." ఓవైసీ ఎటువంటి కారణం చూపించకుండానే తన పార్టీ ఎమ్మెల్సీని సస్పెండ్ చేశారు. దీని వెనక ఒక బలమైన కారణం ఉంది. ఆ ఎమ్మెల్సీ దారుణం చేశాడు. అందువల్లే ఓవైసీ సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. నీతి వాక్యాలు పైకి చెబుతారు. లోపల మాత్రం ఇటువంటి వ్యవహారాలకు పాల్పడుతుంటారని" సయ్యద్ సబ్దర్ అలీ వివరించారు.రహమత్ బేగ్ ను ఎంఐఎం పార్టీ బహిష్కరించింది. వెంటనే శాసనమండలి చైర్మన్ కు తన రాజీనామా సమర్పించాలని ఎంఐఎం జాయింట్ సెక్రెటరీ అన్వర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ ఎమ్మెల్సీ అకృత్యాల గురించి హైదరాబాద్ సిటీ మొత్తం తెలియాలని.. అతడిని ఎంఐఎం నుంచి ఎందుకు బహిష్కరించారో ఓవైసీ తన నోటి ద్వారా చెప్పాలని.. ఈ కేసులో ఎంఐఎం ఎమ్మెల్యే.. ఎంఐఎం కార్పొరేటర్ కూడా ఉన్నారని.. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని.. ఓవైసీ ఏమో హిజాబ్ గురించి చెబుతుంటారని.. ఆడవాళ్ళతో గౌరవంగా ఉండాలని అంటారని.. వాళ్లేమో ఇలా ఆడవాళ్ళ మీద అసభ్యంగా ప్రవర్తిస్తుంటారని.. నా దగ్గర మొత్తం ఆధారాలు ఉన్నాయని.. ముందు ఉంచుతానని.. ఆడవాళ్ళ మీద వాళ్ళ పార్టీ నాయకులు చేస్తున్న అకృత్యాలను ఆయన చెప్పాలని హెచ్ వైసీ నాయకుడు సల్మాన్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తద్వారా ఈ పరిణామం ఎక్కడిదాకా దారి తీస్తుందో చూడాల్సి ఉంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కేబినెట్ లోకి మహేష్ గౌడ్...

**హైదరాబాద్, ఆగస్టు 31, పెన్ పవర్:**
మంత్రి కొండా సురేఖకు సంబంధించిన అంశంపై ఏఐసీసీ పెద్దలతో చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 3న ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో ప్రధానంగా సురేఖను క్యాబినెట్ నుంచి తొలగించడం, మంత్రివర్గంలో విస్తృత మార్పులు చేయడం కోసం కావచ్చని కాంగ్రెస్ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే క్రమశిక్షణా కమిటీ నివేదిక.. ఏఐసీసీకి అందడంతో సెప్టెంబరు 3న జరిగే సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటారనే ప్రచారం కూడా జరుగుతోంది. అలాగే, టీపీసీసీ చీఫ్‌కు మంత్రి పదవి ఇస్తారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో రాజకీయం మరింత వేడిక్కింది. ఓవైపు మంత్రి కొండా సురేఖ వ్యవహారం అధిష్ఠానం వద్దకు చేరడం, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీ వెళ్తున్నారని.. అధిష్టాం నుంచి వారికి పిలుపు వచ్చినట్టు కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. విదేశీ పర్యటనలో ఉన్న ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి కేసీ వేణుగోపాల్ సెప్టెంబర్ 1న ఢిల్లీకి తిరిగి రానున్నారని, అనంతరం తెలంగాణ వ్యవహారాలపై దృష్టి సారించనున్నారని సమాచారం.

ఢిల్లీలో సెప్టెంబర్ 3న జరగనున్న చర్చల్లో కొండా సురేఖ వ్యవహారంతోపాటు క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణపై కూడా కీలక నిర్ణయం తీసుకుంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి కొండా సురేఖ వివాదానికి సంబంధించి ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ నివేదిక ఏఐసీసీకి చేరింది. దీనిపై హైకమాండ్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ, సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షులను ఢిల్లీకి రప్పించడం సురేఖపై చర్యలు తీసుకోవడానికేనా? లేక మొత్తంగా క్యాబినెట్‌లో మార్పులు, చేర్పులు, పార్టీ వ్యవహారాలపై సమగ్ర చర్చ కోసమా? అన్న చర్చ జరుగుతోంది.ఒకవేళ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పిస్తే ఆ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్నది కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌ను క్యాబినెట్‌లోకి తీసుకోవాలన్న ప్రతిపాదనలు ముందు నుంచే ఉన్నాయి. కానీ, ఆయనకు మంత్రి పదవి ఇస్తే.. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరికి అవకాశం ఇస్తారే అనే చర్చ కూడా పార్టీ వర్గాల్లో జరుగుతోంది. పీసీసీ అధ్యక్ష పదవి ఎస్టీ, బీసీల్లో ఒకరికి దక్కవచ్చుని.. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయని తెలుస్తోంది. అంతేకాదు, ఇంకో మంత్రికి కూడా

ఉద్వాసన ఉంటుందని, ఆ స్థానంలో మరొకరిని తీసుకుంటారనే ప్రచారం కూడా ఉంది. ఇదే సమయంలో శాఖలను కూడా మార్చుతారని సమాచారం.

మాకో పదవి అంటున్న మరింత మంది

ఎన్నికలకు ముందు జూపల్లి కృష్ణారావు.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వంటి వారు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. వారికి ఆర్థిక బలం ఉంది కాబట్టి ఎన్నికల్లో గెలిచారు. అలా ఎన్నికల్లో గెలిచిన కొత్తవారు ఈసారి కాంగ్రెస్ పార్టీలో చాలామంది ఉన్నారు. కానీ వారందరినీ పక్కనపెట్టి కృష్ణారావుకు.. శ్రీనివాసరెడ్డికి మంత్రి పదవులు దక్కాయి. శ్రీనివాసరెడ్డి చేతిలో అత్యంత కీలకమైన రెవెన్యూ.. సమాచార పౌర సంబంధాల శాఖ ఉంది. కృష్ణారావు చేతిలో ఎక్సైజ్ శాఖ ఉంది. పార్టీలు మారి వచ్చిన వారికి టికెట్ ఇవ్వడమే కాకుండా.. చివరికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు కొద్దిరోజులుగా కాంగ్రెస్ పార్టీలో కొంతమంది ఎమ్మెల్యేలు అంతర్గతంగా చేస్తున్న ఆరోపణలు. ఇందులో నిజం లేకపోలేదు. కాకపోతే పార్టీ భారాన్ని మొత్తం భుజాన వేసుకొని నడిపించడం అంత ఈజీ కాదు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లోకి వచ్చిన తర్వాతనే పార్టీ దూకుడు పెరిగింది. వేగం పెరిగింది. ఆయన పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కెసిఆర్ కొట్టిన దెబ్బలకు ఇంకొక పార్టీ అయితే లేచేది కాదు. కానీ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో జవసత్వాలు నింపి ఏకంగా పోటీలో నిలపాడు. అంతేకాదు కెసిఆర్ కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ నే అని నిరూపించాడు. బిజెపి గులాబీ పార్టీతో కలుస్తుంది అని ప్రచారం జరుగుతున్న వేళ.. ఎన్నికలను తనకు అనుకూలంగా మార్చుకొని.. విజయం సాధించేలా చేశాడు రేవంత్ రెడ్డి.అధికారంలోకి వచ్చిన తర్వాత చాలామంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరు మారింది. ముఖ్యంగా రేవంత్ రెడ్డికి దక్కుతున్న గౌరవాన్ని చూసి చాలామంది అసూయ పడుతున్నారు. ఈ క్రమంలోనే తమకు మంత్రి పదవులు కావాలని డిమాండ్ చేస్తున్నారు.

సహజంగానే కాంగ్రెస్ పార్టీలో అంతర్గత తగాదాలు ఎక్కువగా ఉంటాయి. ఆ పార్టీలో వ్యక్తిగత ప్రజాస్వామ్యం కూడా అధికంగా ఉంటుంది. అందువల్లే నిత్యం పదవుల కోసం కొట్లాటలు జరుగుతూనే ఉంటాయి. కాంగ్రెస్ పార్టీలో ఇది కొత్తది కాకపోయినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రంలో ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఇది ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితికి.. భారతీయ జనతా పార్టీకి ఆయుధంగా మారింది. రేవంత్ రెడ్డి బలమైన నాయకుడు కావడంతో.. కాంగ్రెస్ పార్టీలో ఉన్న అసమ్మతిని ఎగదోసి రేవంత్ రెడ్డిని బలహీనపరిచే కుట్రలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. అనిరుద్ రెడ్డి.. అద్దంకి దయాకర్.. ఇంకా కొంతమంది నాయకులు మంత్రి పదవుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేశారు. అనేక రకాలుగా లాబీయింగ్ చేపట్టారు. చివరికి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చి సొంతంగా పార్టీ పెట్టుకున్నారు. ఇంకా చాలామంది నాయకులు.. పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలలో భాగంగా రేవంత్ నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ కోరుకున్నట్టుగానే రేవంత్ రెడ్డి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. అయితే ఇది ఆ నాయకులకు ఏమాత్రం లాభం చేకూర్చకపోగా.. కాంగ్రెస్ పార్టీ మరింత బలహీనం కావడానికి కారణమవుతోంది. ఒకవేళ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పుడున్న పరిస్థితుల్లో బలహీనమైపోతే.. ఇక జన్మలో తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కాకముందే కొంతమంది ఎమ్మెల్యేలు పక్క చూపులు చూడటం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఆ ఎమ్మెల్యేలతో రేవంత్ రెడ్డి మాట్లాడకపోవడమే ఇంతటి పరిస్థితికి కారణమైందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా మునుచుకుపోయింది లేదని.. ఎందుకైనా మంచిది రేవంత్ రెడ్డి వాళ్లతో మాట్లాడి.. సమస్యలు పరిష్కరిస్తేనే కాంగ్రెస్ పార్టీ ఈ ముసలం నుంచి బయటపడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# కౌశిక్ రెడ్డిపై వేటు తప్పదా

**హైదరాబాద్, ఆగస్టు 31, పెన్ పవర్:**
ఈ ఏడాది మార్చిలో అసెంబ్లీలో జరిగిన గొడవ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సీటుపై చర్చకు దారితీస్తోంది. కడియం శ్రీహరితో వాగ్వాదం, అనుచిత సైగలు చేశారన్న ఆరోపణలతో స్పీకర్ ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేశారు. ఎథిక్స్ కమిటీ లేకుండానే..కౌశిక్‌రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీకి ఫార్వర్డ్ చేయడమేంటంటూ బీఆర్ఎస్ క్వశ్చన్ చేస్తూ వచ్చింది. ఎథిక్స్ కమిటీ కౌశిక్‌రెడ్డి నుంచి వివరణ తీసుకుంటుందా.? మందలింపుతో సరిపెడుతుందా? లేక కఠిన చర్యలకు సిఫారసు చేస్తుందా.? అన్నది ఉత్కంఠగా మారింది. అయితే ఎథిక్స్ కమిటీ విచారణ జరిపి సిఫారసు చేయడం ఒక దశ. దానిపై స్పీకర్, సభ నిర్ణయం తీసుకోవడమనేది సెకండ్ ఎపిసోడ్. కాబట్టి ఇప్పుడే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే పదవి ఉంటుందో.? ఊడుతుందో.? చెప్పలేం. కానీ.. వేటు పడితే ఏంటన్న చర్చ మాత్రం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది.ఒకవేళ వేటు వేసే సిచ్యువేషన్ ఉంటే..కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చినా..లేదా ఏదైనా చట్టపరమైన ప్రక్రియ ద్వారా హుజూరాబాద్ స్థానం ఖాళీ అయినా..అక్కడ మరోసారి ఉప ఎన్నిక తప్పదన్నదే ఇప్పుడు ఇంట్రస్టింగ్ పాయింట్. బీఆర్ఎస్ హయాంలో అక్కడ ఉప ఎన్నిక జరిగింది. ఇప్పుడు మరోసారి బైపోల్ వస్తే మాత్రం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ బలాబలాల పరీక్షగా మారే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ ఎథిక్స్ అస్త్రంపై బీఆర్ఎస్ ఎదురుదాడి మొదలుపెట్టింది.కాంగ్రెస్ అంతర్గత పోరు నుంచి జనం దృష్టిని మరల్చేందుకే కౌశిక్‌రెడ్డి ఇష్యూను మరోసారి తెరపైకి తెచ్చారంటున్నారు బీఆర్ఎస్. రాష్ట్రంలో ఇన్ని సమస్యలు ఉండగా..ఓ వైపు అధికార పార్టీ

మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్..ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యల దుమారం నడుస్తుంటే..కౌశిక్‌రెడ్డి అంశంపై ఎథిక్స్ కమిటీ భేటీ కావడం పక్కా అటెన్షన్ డైవర్షన్ గేమే అంటోంది కారు పార్టీ. అంతేకాదు సీఎం సహా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తనను కూడా కమిటీ ముందు ప్రస్తావిస్తామంటోంది బీఆర్ఎస్. కౌశిక్‌రెడ్డి వ్యవహారాన్ని బీఆర్ఎస్ కేవలం ఒక ఎమ్మెల్యే కేసుగా కాకుండా..రాజకీయ అంశంగా మార్చే ప్రయత్నం చేస్తోందన్న చర్చ సాగుతోంది.ఒకవేళ కౌశిక్‌రెడ్డిపై వేటు పడి..హుజూరాబాద్ ఉపఎన్నిక వస్తే..కాంగ్రెస్‌కు అగ్నిపరీక్షగా మారనుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల తీర్పుగా బీఆర్ఎస్ ప్రచారం చేసే అవకాశం ఉంటుంది. మరోవైపు బీఆర్ఎస్‌కు కూడా తమ రాజకీయ బలం ఎంతో చూపించుకునే వేదికగా మారొచ్చు. ఎథిక్స్ కమిటీ దగ్గర మొదలైన వ్యవహారం..చివరికి హుజూరాబాద్ ఎన్నికల బరిలోకి వెళుతుందా.? లేక అసెంబ్లీ హాల్ లోపలే సమసిపోతుందా అనేది సస్పెన్స్‌గా మారింది.అసెంబ్లీలో కౌశిక్‌రెడ్డి దూకుడు. ప్రభుత్వంపై వరుస విమర్శలు..వివాదాస్పద వ్యాఖ్యలు..సస్పెన్షన్లతో ఆయన ఇప్పటికే పేరు పలుసార్లు వార్తల్లోకి నిలిచారు. చర్యలు లేకపోతే..ఈ ఎపిసోడ్ అక్కడితో ముగిసినట్టే.స్ట్రిక్ట్ యాక్షన్‌కు ఎథిక్స్ కమిటీ సిఫారసు చేస్తే మాత్రం..కొత్త పొలిటికల్ ఫైట్ మొదలయ్యే ఛాన్స్ ఉంది. వేటు వేస్తే ఎమ్మెల్యే పదవిపై ప్రభావం చూపే పరిస్థితి వస్తే..హుజూరాబాద్‌లో ఉపఎన్నిక రావొచ్చు. అప్పుడు హుజూరాబాద్ మళ్లీ తెలంగాణ రాజకీయాల హాట్ టాపిక్‌గా మారుతుందా.? బీఆర్ఎస్ మళ్లీ ఆ సీటును నిలబెట్టుకుంటుందా.? కాంగ్రెస్ గులాబీ కోటలో పాగా వేస్తోందా.? ఎథిక్స్ కమిటీ విచారణతో కౌశిక్‌రెడ్డి ఎపిసోడ్ ఏ మలుపు తిరుగుతుందోనన్నది సస్పెన్స్‌గా మారింది

# గుడివాడ వైసీపీలో గడబిడ.. మాజీ మంత్రి కొడాలిపైనే ఆశ!

**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏపీ రాజకీయాలు హీటెక్కుతున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో కొన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు ఉత్కంఠకు దారితీస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో వచ్చే ఫలితాలు కూటమి ప్రభుత్వానికి రెఫరెండంగా పరిగణించే పరిస్థితులు ఉండగా, వచ్చే ఎన్నికల నాటికి నిలదొక్కుకోవాలంటే ఈ ఎన్నికల్లో తప్పక విజయం సాధించాల్సిన పరిస్థితిలో విపక్షం వైసీపీ ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీలోని ముఖ్యనేతలకు చెందిన నియోజకవర్గాల్లో ఎన్నికలు ఎలా ఉంటాయనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గంపై దృష్టిపెట్టిన అధికార టీడీపీ 'వైనాట్ పులివెందుల' అంటూ గర్జిస్తుంది. ఇక వైసీపీలో జగన్ తర్వాత టీడీపీ మెయిన్ టార్గెట్ గా ఉన్న మాజీ మంత్రి కొడాలిని కూడా దెబ్బతీయాలనే వ్యూహంతో ఆయన సొంత నియోజకవర్గం గుడివాడపైనా పక్కా వ్యూహరచన చేస్తున్నట్లు చెబుతున్నారు.

వైసీపీ హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గుడివాడ మున్సిపాలిటీని ఆ పార్టీ సునాయాశంగా దక్కించుకుంది. మొత్తం 31 వార్డులు ఉండగా, అన్ని స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులే గెలుపొందారు. ఇటువంటి బలమైన పట్టు ఉన్న మున్సిపాలిటీని నిలబెట్టుకోవడం ఇప్పుడు వైసీపీకి అత్యంత ప్రధానంగా చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయి పరిస్థితులు అనేక సవాళ్లు విసుతున్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా వైసీపీ ఇంచార్జి, మాజీ మంత్రి కొడాలి నాని స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో కేడర్ డీలా పడుతోందని అంటున్నారు. రెండేళ్లుగా ఆయన ఎక్కువగా హైదరాబాదులోనే ఉంటున్నారు. అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నా, బలమైన ప్రభుత్వంతో ఢీకొట్టడం కేడర్ కు అంత ఈజీ ఏమీ కాదని అంటున్నారు.

ఈ పరిస్థితుల్లో గుడివాడ మున్సిపాలిటీపై వైసీపీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోందని అంటున్నారు. మాజీ మంత్రి కొడాలి అందుబాటులో ఉంటే కూటమి ప్రభుత్వాన్ని ఎదిరించగలమని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. అయితే కొడాలి ఎన్నికల ముందు వచ్చి ప్రచారం చేస్తామంటే ఫలితం ఉండదని తేల్చిచెబుతున్నారు. దీంతో గుడివాడ భారం అంతా మాజీ మంత్రి కొడాలి భుజాలపై మోపుతున్న పరిస్థితి ఉందని అంటున్నారు. నిజానికి గుడివాడలో రెండు దశాబ్దాలుగా కొడాలి నాని పోటీ చేశారు. గత ఎన్నికల్లో ఆయన తొలిసారిగా ఓడిపోయారు. పట్టణంలో వ్యక్తిగత ఇమేజ్ ఉండటంతో వైసీపీ గట్టి పోటీ ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు. అయితే కొడాలి తక్షణం హైదరాబాద్ వదిలి వస్తేనే ఈ పోటీ ఇవ్వగలిగే పరిస్థితిలో వైసీపీ ఉంటుందనే అంచనాలు వేస్తున్నారు.మరోవైపు మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు టీడీపీలో ఉండటం కూడా వైసీపీకి ఆందోళన కలిగిస్తోందని చెబుతున్నారు. ఒకప్పుడు మాజీ మంత్రి కొడాలి సన్నిహితుడిగా పట్టణంలో రాజకీయాలను యలవర్తి చక్కబెట్టేవారని, కొడాలి లేకున్నా ఆయన తన ప్రతిభతో పార్టీని నడిపించేవారని అంటున్నారు. అయితే ఇప్పుడు ఆయన టీడీపీ తరఫున గట్టిగా పనిచేయడం, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కూడా టీడీపీ కేడర్ కు వెన్నుదన్నుగా నిలుస్తూ మున్సిపాలిటీపై పసుపు జెండా ఎగరేసేలా వ్యూహాలు రచిస్తుండటంతో వైసీపీ కేడర్ వెనక్కి తగ్గాల్సివస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా కీలకమైన గుడివాడలో వైసీపీ పూర్వవైభం సాధించాలంటే మున్సిపల్ ఎన్నికల్లో మాజీ మంత్రి కొడాలి చూసే తెగువే ప్రధాన పోషిస్తుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# మూడు మేయర్ సీట్లపై కమలం పార్టీకి పట్టు..

**విశాఖపట్టణం, ఆగస్టు 31, పెన్ పవర్:** ఇటు టీడీపీ. ఇటు జనసేన. కూటమిలోని ఈ రెండు పార్టీలు.. స్థానిక ఎన్నికలపై ఎవరి లెక్కల్లో వారు బిజీగా ఉన్నారు. బీజేపీ కూడా సైలెంట్‌గా ఉంటూనే పకడ్బందీ ప్లానింగ్స్ చేస్తోందట. కార్పొరేషన్ ఎన్నికల్లో డైరెక్ట్ ఫైట్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాలకు పదును పెడుతోందట కమలం పార్టీ. విశాఖ మేయర్ పీఠంపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టిందట. ఏపీ నగర పాలక సంస్థల్లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అతిపెద్దది. 125 డివిజన్ల డీలిమిటేషన్ ప్రాసెస్ కూడా జరగబోతోంది. విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లాలో విస్తరించి ఉంది. అందుకే ఇక్కడ మేయర్ పీఠం అంటే దాదాపు క్యాబినెట్ మంత్రితో సమానం అన్నట్లుగా భావిస్తున్నారు.ఆంధ్ర ప్రదేశ్ వార్తలుఏడాదికి ఐదారు వేల కోట్ల బడ్జెట్ ఉండే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పీఠం అంటే చాలా పెద్ద పదవి అనే చెప్పొచ్చు. ప్రత్యక్ష ఎన్నికలు జరగబోతుండటంతో తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించాలని మూడు పార్టీలు ఆశిస్తున్నాయి. బీజేపీ ఈ మేయర్ పీఠాన్ని తమకు విడిచి పెట్టాలని కోరాలని డిసైడ్ అయిందట.1979లో కాంగ్రెస్ పార్టీతో పోటీపడి మరీ ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని సొంతం చేసుకుంది బీజేపీ. అప్పుడు జనసంఘ్ రూపంలో ఉన్న బీజేపీ.. తొలిసారి విశాఖ మేయర్ అభ్యర్థిని గెలిపించుకొని హిస్టరీ క్రియేట్ చేసింది. ఇప్పటికీ విశాఖ నగరంలో బీజేపీకి మంచి పట్టు ఉన్నట్లు చెబుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ ఎంపీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం నడిచింది. కాని పొత్తుల్లో భాగంగా పక్కనున్న అనకాపల్లి స్థానం బీజేపీకి దక్కగా.. అక్కడి నుంచి కమలం పార్టీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ గెలిచారు. విశాఖ గ్రేటర్ పరిధి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా కొంత విస్తరించి ఉంటుంది. దీంతో తమకు గ్రేటర్ పీఠం ఇస్తే ఈజీగా గెలుచుకోవచ్చనే అంచనాల్లో ఉందట కమలం పార్టీ. సేమ్‌టైమ్ గత ఎన్నికల్లో తమకు విశాఖ ఎంపీ సీటు ఇవ్వకపోవడంతో.. ఇప్పుడు మేయర్ పీఠం అయినా వదిలేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారు బీజేపీ నేతలు.విశాఖ మేయర్ సీటుతో పాటు.. విజయవాడ, తిరుపతి నగర పాలక సంస్థలపై కూడా బీజేపీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గ్రేటర్ విశాఖ పరిధిలో బీజేపీకి ఓ ఎమ్మెల్యే, మరో ఎంపీ ఉన్నారు. 2014లో కూడా విశాఖ ఎంపీ సీటును బీజేపీ గెలిచింది. దీంతో తమకు పట్టున్న చోట మేయర్ సీటు దక్కించుకొని.. ఇంకా బలం పెంచుకునే ప్లాన్‌లో ఉన్నారట కమలనాథులు. ఇక గత ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సీటును గెలుచుకున్న బీజేపీ.. బెజవాడ మేయర్ సీటుకోసం పట్టుబట్టేందుకు రెడీ అవుతోందట. తిరుపతి మేయర్ స్థానం కూడా తమకే ఇవ్వాలని కోరబోతోందట. కూటమి పెద్దల భేటీలో తమ వాదనను బలంగా వినిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. స్టేట్ మొత్తంలో అర్బన్ ఏరియాల్లో తమ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవుల్లో పార్టీకి తగిన ప్రాధాన్యం దక్కేలా సీట్ల సర్దుబాట్లపై దృష్టి పెట్టాలని బీజేపీ డిసైడ్ అయిందట.రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవుల పంపకంపై ఇప్పటి నుంచే రాజకీయ చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా విశాఖతో పాటు విజయవాడ, తిరుపతి నగరాలు రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మికంగా కీలకమైనవి కావడంతో ఇక్కడ మేయర్ పీఠాలను దక్కించుకుంటే పార్టీకి సంస్థాగతంగా, రాజకీయంగా మరింత ప్రయోజనం ఉంటుందని బీజేపీ అంచనా వేస్తోందట.పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, స్థానిక బలాబలాలు వంటి సమీకరణలు మేయర్ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రలో తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని బీజేపీ నేతలు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌పై ఒత్తిడి తెస్తున్నారట. అసెంబ్లీ ఎన్నికల్లో సర్దుబాట్ల కోసం ఫాలో అయిన విధానం కాకుండా.. ఇప్పుడు స్థానికంగా పార్టీల బలం, అభ్యర్థుల సామర్థ్యం, వార్డుల వారీగా సమీకరణాలను లెక్కలులోకి తీసుకోవాల్సి ఉంటుంది. విశాఖ, విజయవాడ, తిరుపతి మేయర్ పీఠాల కోసం బీజేపీ పట్టుబడితే.. కూటమిలోని టీడీపీ, జనసేన నుంచి స్పందన ఎలా ఉంటుందో.. కమలం పార్టీ ఆశించినట్లు మేయర్ సీట్లు దక్కుతాయో లేదో చూడాలి మరి.

# ఇంటి వద్దకే బస్సు...

**విజయవాడ, ఆగస్టు 31, పెన్ పవర్:** ప్రయాణికుల కోసం ఏపీఎస్ఆర్టీసీ మరో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టనుంది. ఇంటి వద్దే పికప్ సౌకర్యం కల్పించే ఆలోచన చేస్తోంది. పదిమందికిపైగా బల్క్ బుకింగ్ చేసుకుంటే వారి ఇంటి వద్దకే బస్సును పంపించే ఆలోచన చేస్తోంది. అయితే దూరప్రాంతాలకు వెళ్లే హైయ్యండ్ బస్సు సర్వీసులలోనే ఈ విధానం అమలు చేయనున్నారు. అది కూడా విజయవాడ నగర పరిధిలో మాత్రమే ఈ విధానం అమలు చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఎప్పటికప్పుడు కొత్త చర్యలు చేపడుతూ వస్తోంది. ప్రయాణికుల ఆదరణ చూరగొనేందుకు కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే విజయవాడ రీజియన్ ఆర్టీసీ అధికారులు ఓ సరికొత్త విధానాన్ని అనుసరించనున్నారు. ప్రయాణికుల ఇంటి వద్దకే బస్సు పికప్ సదుపాయాన్ని కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అయితే ఇవి కేవలం కొన్ని బస్సులకే అమలు చేయనున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ అగ్రశ్రేణి బస్సులలో పదిమందికి పైగా ప్రయాణికులు తమ టికెట్లను బల్క్‌గా బుక్ చేసుకుంటే.. ఆర్టీసీ అధికారులు ఇంటి వద్దకే పికప్ కోసం బస్సును పంపించే ఆలోచన చేస్తున్నారు.మరోవైపు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన సూపర్ లగ్జరీ, ఏసీ, స్లీపర్ వంటి బస్సులు దూరప్రాంతాలకు సేవలు అందిస్తుంటాయి. ఈ బస్సులలో ప్రయాణించేందుకు మనమంతా ముందుగానే టికెట్లు బుక్ చేసుకుంటూ ఉంటాయి. అందులో నిర్దేశించిన సమయానికి బస్టాండ్ వద్దకు చేరుకుంటూ ఉంటాం. అయితే లగేజీ ఎక్కువగా ఉన్న సమయంలో బస్సులు ఆగే చోటకు చేరుకోవడం ఒక్కొక్కసారి ఇబ్బందిగా మారుతూ ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు ఈ ఇంటి వద్దే బస్ పికప్ ఆలోచన చేస్తున్నారు. ప్రయాణికులు బల్క్‌గా టికెట్లు బుక్ చేసుకున్న సమయంలో.. వారిని ఇంటి వద్ద నుంచే పికప్ చేసుకునే సౌకర్యం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు.అయితే రాష్ట్రవ్యాప్తంగా కాకుండా తొలుత ప్రయోగాత్మకంగా విజయవాడ నగర పరిధిలోనే ఈ ఇంటి వద్దే పికప్ విధానాన్ని అమలు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా హైయ్యండ్ శ్రేణిలో ఉన్న అన్ని ఏపీఎస్ఆర్టీసీ బస్సులను ప్రయాణికుల ఇళ్ల వద్దకు పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎవరైతే పదికి పైగా బల్క్‌గా టికెట్లు బుక్ చేసుకుంటారో ఆ ప్రయాణికులు.. తమ బుకింగ్ సమాచారాన్ని ముందుగా ఆర్టీసీ అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఇక ఈ విధానాన్ని అమలు చేసేందుకు గానూ త్వరలోనే కొత్త వ్యవస్థను అమల్లోకి తెచ్చేందుకు విజయవాడ ఏపీఎస్ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు త్వరలోనే పూర్తిగా వెల్లడికానున్నాయి

# ఏపీలో స్థానిక ఎన్నికలు..
# చంద్రబాబు బాటలో జగన్!

**కడప ఆగస్టు 31, పెన్ పవర్:** వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేశారు. ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అటువంటి చోట నియోజకవర్గ ఇన్చార్జి లకు టికెట్లు ఇవ్వనని తేల్చి చెప్పారు. కానీ ఈ ప్రకటన వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. కచ్చితంగా ఈ ప్రకటనతో తెలుగుదేశం కూటమి ముందుగానే పావులు కదుపుతుంది. ముందుగా పులివెందుల నియోజకవర్గం పైనే ఫోకస్ పెడుతుంది. గత ఏడాది పులివెందుల జడ్పిటిసి స్థానం ఏ విధంగా పట్టుబట్టి గెలిచిందో.. కచ్చితంగా పులివెందుల మునిసిపాలిటీని సైతం అలాగే కైవసం చేసుకుంటుంది. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో ఒకరు మున్సిపల్ అభ్యర్థిగా వైసీపీ తరఫున బరిలో నిలుస్తారు. కానీ ఆ పార్టీకి కౌన్సిలర్ల అభ్యర్థులు మాత్రం దొరకరు. అంతలా ఉంటుంది టిడిపి వేట అక్కడ. ఇప్పటికే టిడిపి బృందం ఒకటి పులివెందులలో వాలిపోయింది. వారు వార్డుల్లో ఏకగ్రీవాలకు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయిపులివెందులలో ఏకగ్రీవాలు జరిగితే మాత్రం జగన్మోహన్ రెడ్డి నుంచి మరో ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఏకపక్షంగా గెలిచి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్థానం దక్కకపోతే మాత్రం జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా డిఫెన్స్ లో పడతారు. అయితే కీలక కూటమి నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో చాలా మున్సిపాలిటీలు ఏకగ్రీవాలు జరుగుతాయి. అది జగన్మోహన్ రెడ్డికి కూడా తెలుసు. ఒకవేళ ఏకగ్రీవాలు జరిగి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఓటమి ఎదురైతే.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తారు. ఇది జరిగే పని అంటూ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.2021లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ముందుగా పంచాయితీల ఎన్నికలు జరిగాయి. తరువాత మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. కుప్పం నియోజకవర్గంలో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మొత్తం మోహరించింది. ఎలాగైనా మున్సిపాలిటీ ని కైవసం చేసుకోవాలని చూసింది. అయినా సరే టిడిపి శ్రేణులు ప్రతిఘటించాయి. కానీ ఫలితం లేకపోయింది. పరిమిత వార్డులకే టిడిపి పరిమితం అయింది. అంతకుముందు పంచాయతీ ఎన్నికల్లో సైతం ప్రలోభాలతో, భయపెట్టి మరి వైసీపీ సానుభూతిపరులు గెలిచారు. కేవలం కుప్పం ఫలితాలతో చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. అందుకే తరువాత వచ్చిన మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలను బహిష్కరించారు చంద్రబాబు. ఇప్పుడు కూడా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి అదే పరిస్థితి ఎదురైన మరుక్షణం.. తరువాత ఆ రెండు స్థానిక ఎన్నికలను జగన్మోహన్ రెడ్డి బహిష్కరిస్తారు. ఇది ఒక వ్యూహం అని తెలుస్తోంది. స్థానిక ఎన్నికలు బహిష్కరించిన చంద్రబాబు స్ట్రాటజీ అప్పట్లో చాలా విమర్శలకు తావిచ్చింది. కానీ సార్వత్రిక ఎన్నికల నాటికి ఆ ప్రయోగమే ఫలించింది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి సైతం అదే ఫార్ములాను అనుసరించనున్నారు.

## జొన్నగిరిలో వజ్రాల వేట

**కర్నూలు ఆగస్టు 31, పెన్ పవర్:** కర్నూలు జిల్లాలోని జొన్నగిరి ప్రాంతం వజ్రాల వేటకు ప్రసిద్ధి. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఇక్కడి ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారు వజ్రాల కోసం పొలాలు, పరిసర ప్రాంతాల్లో వెతుకులాట ప్రారంభిస్తారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసిన తర్వాత నేలపైకి కొట్టుకొచ్చే రాళ్లు, ఖనిజాల్లో వజ్రాలు దొరికే అవకాశం ఉందన్న నమ్మకంతో చాలామంది ఈ వేటకు వస్తుంటారు.జొన్నగిరి ప్రాంతంలో వర్షం కురిసిన తర్వాత పొలాల్లోని మట్టి కొట్టుకుపోయి, భూమి లోపలి పొరల్లో ఉన్న రాళ్లు బయటపడతాయి. దీంతో వజ్రాల కోసం వెతికేవారికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని స్థానికులు చెబుతుంటారు. వర్షం తగ్గిన వెంటనే కొందరు స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పొలాల్లోకి వెళ్లి నేలను జల్లెడ పడతారు. మెరుస్తున్న రాళ్లు కనిపిస్తే వాటిని సేకరించి పరీక్షించుకుంటారు. జొన్నగిరి ప్రాంతంలో గతంలో వజ్రాలు లభించాయన్న వార్తలు తరచూ వెలువడ్డాయి. కొందరికి విలువైన రాళ్లు దొరికాయని ప్రచారం జరగడంతో వర్షాకాలంలో వజ్రాల వేటపై ఆసక్తి మరింత పెరుగుతోంది. అయితే ప్రతి మెరిసే రాయి వజ్రం కాదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కనిపించే కొన్ని ఖనిజాలు కూడా వజ్రాల మాదిరిగా మెరుస్తుంటాయి. నిజంగా వజ్రమా కాదా అనేది నిపుణుల పరీక్షల ద్వారానే నిర్ధారించాల్సి ఉంటుంది.వజ్రం దొరికితే ఒక్కసారిగా తమ జీవితాలు మారిపోతాయన్న ఆశతో కొందరు వర్షం పడిన ప్రతిసారీ పొలాల్లోకి వెళ్తుంటారు. గంటల తరబడి నేలను పరిశీలిస్తూ రాళ్లను ఏరుకుంటారు. వర్షాకాలంలో జొన్నగిరి ప్రాంతంలో కనిపించే ఈ దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే వజ్రాల వేటకు వెళ్లేవారు స్థానిక నిబంధనలు, భూమి యజమానుల అనుమతులు, భద్రతా అంశాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. వర్షం పడితే జొన్నగిరిలో మొదలయ్యే ఈ వజ్రాల వేట.. అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంగా మారుతోంది.

## 25 ఇండస్ట్రియల్ పార్క్ లకు లైన్ క్లియర్

**అనంతపురం ఆగస్టు 31, పెన్ పవర్:** కేంద్రం భవ్య పథకం కింద దేశవ్యాప్తంగా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా తొలి దశలో దేశవ్యాప్తంగా 20 పార్కుల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానించగా ఏపీఐఐసీ ఆరింటికి ప్రతిపాదనలు పలికింది. అయితే రెండు పార్కులకు మాత్రమే కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. దాంతో రెండో దశలో 16 చోట్ల పార్కుల అభివృద్ధికి వీలుగా ఏపీఐఐసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ 22తో పాటు మరో మూడు పార్కులను కూడా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. దాని కోసమే ఇప్పుడు 25 పార్కులకు 20 ఎకరాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది.కూటమి ప్రభుత్వం పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త కళ సంతరించుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలైనా, కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలైనా.. అభివృద్ధి చర్యలైనా ఆంధ్రప్రదేశ్ వరకూ వస్తున్నాయి. ఏపీలోని అధికారిక కూటమి ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామ్యం కావడంతో దేశ వ్యాప్తంగా భవ్య పథకం కింద అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక పార్కుల్లో ఏపీకి కూడా అవకాశం కల్పించారు.రాష్ట్రంలో 25 భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ సంకల్పించింది. మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ పథకాల కింద కేంద్ర నిధులను వినియోగించుకోవాలని భావిస్తోంది. భవ్య కింద 22 పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ 22తో పాటు రాష్ట్రంలో ఏర్పాటయ్యే భారీ ప్రాజెక్టులకు అనుసంధానంగా శ్రీకాకుళం, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో కొత్తగా పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీని కోసం ఇప్పటికే 12 వేల ఎకరాలు సేకరించింది. కొత్తగా జాబితాలో చేరిన మూడు పార్క్‌ల కోసం మరో 8 వేల ఎకరాల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.భవ్య పథకం కింద రూ. 33,600 కోట్లతో దేశ వ్యాప్తంగా వంద పార్కులు అభివృద్ధి చేయాలన్నది కేంద్రం ప్రతిపాదన. ఇందులో మొదటగా 20 పార్కుల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానించగా.. రాష్ట్రం నుంచి ఆరింటికి ఏపీఐఐసీ ప్రతిపాదనలు పంపింది. అందులో కేవలం రెండింటికి మాత్రం కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రెండో దశలో 80 పార్కుల కోసం కేంద్రం దరఖాస్తులు ఆహ్వానించగా.. ఈ సారి 16 చోట్ల పార్కుల అభివృద్ధికి వీలుగా ఏపీఐఐసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.ప్రస్తుతానికి పారిశ్రామిక పార్కులో మౌలిక సదుపాయాల కోసం ఎకరాకు రూ. కోటి చొప్పున కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది. ఈ పథకం కింద పార్కుల అభివృద్ధికి 90 శాతం భూములు సేకరించాలన్న నిబంధన ఉండటంతో ఇప్పటికే ఏపీఐఐసీ 22 పార్కులకు 12 వేల ఎకరాలను సేకరించింది. ఈ 22తో పాటు మరో మూడు పార్కుల అభివృద్ధికి కూడా ఏపీఐఐసీ ప్రతిపాదనలు రూపొందించడం విశేషం. శ్రీకాకుళం జిల్లా మూలపేట, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న మూడు పార్క్‌ల ద్వారా మరో 8 వేల ఎకరాలను పారిశ్రామిక అవసరాల కోసం అందుబాటులోకి తేవాలని ఏపీఐఐసీ భావిస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# వైసీపీలో వర్గపోరు.. సీనియర్ నేతల పొలిటికల్ వార్... !



గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో అధికారంలో ఉన్న వైసిపి కేవలం 11 సీట్లతో సరిపెట్టుకుంది. పలు జిల్లాల్లో అసలు ఆ పార్టీకి ప్రాధినిత్యం లేకుండా పోయింది. చింత చచ్చినా పులుపు చావలేదు అన్నట్టుగా గత ఎన్నికల్లో ఒక్క సీటు గెలుచుకోని జిల్లాలలో వైసీపీలో సీనియర్ నేతలు మధ్య రాజకీయం రాజుకుంది. అసలే పార్టీ కష్టాల్లో ఉంది.. అందరం కలిసి పని చేద్దాం అని పార్టీ అధినేత జగన్ చెబుతుంటే.. జిల్లాస్థాయిలో నేతల మాత్రం ఎవరికి వారే రాజకీయ ఆధిపత్యం కోసం పార్టీని ముంచేస్తున్నారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లాలో పార్టీ పరిస్థితి దారుణంగా మారింది. తాజాగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కుమారుడు రామ్ మనోహర్ నాయుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లా వైసీపీ వర్గాల్లో తీవ్రదుమారం రేపుతున్నాయి.మరి ముఖ్యంగా సొంత పార్టీ నాయకులను ఉద్దేశించి రామ్ మనోహర్ చాలా ఘాటుగా మాట్లాడారు. మా జిల్లాపై పక్క జిల్లాల వాళ్ళ పెత్తనం ఏంటని ? మాకు ఎవరి పెత్తనం అక్కర్లేదని.. ఎవరి తల వాళ్ళు దువ్వుకుంటే పాపిట తిన్నగా ఉంటుంది.. అదే పక్కనోడు దువ్వితే వంకరగా ఉంటుందని సెటైర్ వేయటం సంచలనంగా మారింది. తన తండ్రి ధర్మాన ప్రసాదరావు 2004లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని ఒంటి చేత్తో గెలిపించారని.. నాడు పక్క జిల్లాల వాళ్ళు గెలిపించలేదని రామమనోహర్ చెప్పారు. ఆయన చేసిన కామెంట్లు చూస్తుంటే శ్రీకాకుళం పక్కనే ఉన్న విజయనగరం జిల్లాకు చెందిన బొత్స సత్యనారాయణ ఉద్దేశించే అన్నారని పార్టీలో చర్చ జరుగుతుంది.పార్టీ గత ఎన్నికల్లో ఓడిపోయినా బొత్స పార్టీలో చాలా యాక్టివ్ గా ఉన్నారు. పైగా విశాఖ జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా గెలిచారు. ఆ కుటుంబానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని మంచి గ్రిప్ ఉంది. మరీ ముఖ్యంగా ఎచ్చెర్ల – రాజాం నియోజకవర్గాలు విజయనగరం లోక్‌సభ సీటు పరిధిలోకి వెళ్లాయి. పాలకొండ మన్యం జిల్లాలో భాగంగా ఉంది. దీంతో ఈ మూడు నియోజకవర్గాలు పూర్తిగా బొత్స కనుసన్నల్లోకి వెళ్లిపోయాయి అని వైసిపి వాళ్ళే భావిస్తున్నారు. జిల్లాలోని తూర్పు కాపులు, కాళింగులతో పాటు ఇతర సామాజిక వర్గాల వాళ్ళు కూడా బొత్సతోపాటు ఆయన మేనల్లుడు చిన్న శ్రీను వద్దకు పరుగులు పెడుతూ ఉంటారు.

రామ్‌మనోహర్ కామెంట్లు తన తండ్రి మనసులో ఉన్న మాటలే అని.. ఆయనకు తెలియకుండా అంత డేర్‌గా మాట్లాడరని వైసీపీ వాళ్లే గుసగుసలాడుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ధర్మానకు జగన్ దగ్గర పలుకుబడి తగ్గింది. అసలు ధర్మానను శ్రీకాకుళం ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించాలని కూడా జగన్ ఆలోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇటు బొత్స ఎమ్మెల్సీగా గెలవడం.. మండలిలో పార్టీ ప్రతిపక్షనేతగా ఉండడంతో బొత్స ఇమేజ్ పెరుగుతోంది. బొత్స తమ జిల్లాలో జోక్యం చేసుకోవడం నచ్చకే రామ్‌మనోహర్ ఈ కామెంట్లు చేశారని వైసీపీ ఇన్నర్ టాక్ ?

# కూటమికి ‘వెలిగొండ’... ఓట్ల సిరులు!



ఒక ప్రాజెక్టు రాజకీయాలపై ప్రభావం చూపుతుందా? ఓటు బ్యాంకుగా మారుతుందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తుంది. ముఖ్యంగా కరువు పీడిత ప్రకాశం, మార్కాపురం(కొత్త జిల్లా) నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో తాజాగా సీఎం చంద్రబాబు ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు కీలక మార్పులు తీసుకురానుంది. తద్వారా.. ఆయా మండలాల్లోని సుమారు 6 లక్షల మందికిపైగా ప్రజల జీవితాల్లోనూ మార్పు తీసుకువస్తుందని అంచనా వేస్తున్నారు.ఇక, సాగు భూములు మునుపటి మాదిరిగా చుక్కనీటి కోసం బిక్కమొహం వేయకుండా.. జల జల పారే కృష్ణానీటితో కళకళ లాడడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదేసమయంలో నిన్నమొన్నటి వరకు ఫ్లోరైడ్ నీరు లేదా .. ప్రభుత్వం ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్న నీటిపైనే ఆధారపడిన ప్రజలకు ఇప్పుడు .. కృష్ణానది నీరు గంగా జలంలా.. వారి దాహార్తిని తీర్చనుంది. అదేసమయంలో ఫ్లోరైడ్ ముప్పును కూడా పరిహరించనుంది.

**రాజకీయంగా ప్రభావం..**

మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని దాదాపు లక్షా 19 వేల ఎకరాలకు సాగునీరు ఈ వెలిగొండ తొలి దశ ప్రాజెక్టు ద్వారా లభిస్తుంది. ముఖ్యంగా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలోని సుమారు 4 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందుతుంది. ఇవన్నీ కూడా రాజకీయంగా ప్రభావితం చూపించే అంశాలే కావడం గమనార్హం. అదేసమయంలో ఇప్పటికే ఉమ్మడి ప్రకాశం , నెల్లూరు జిల్లాల్లో టీడీపీ సహా కూటమి పార్టీలకు బలం ఉంది. అయితే.. 30 ఏళ్ల కల సాకారం కావడం.. రైతులకు నీటిని సమృద్ధిగా అందిస్తున్న నేపథ్యంలో మరింతగా కూటమి ప్రభావం పెరుగుతుందన్న అంచనాలు వస్తున్నాయి.

వెలిగొండ ప్రాజెక్టుతో కడపకు జరిగే ప్రయోజనం మరింత చర్చనీయాంశం. ఈ జిల్లాలోని బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని కరవు పీడిత మండలాల్లో ఉన్న వేలాది ఎకరాల ఆయకట్టుకు శాశ్వతంగా సాగునీరు అందుతుంది. శ్రీశైలం జలాశయం నుండి తరలించే కృష్ణా వరద జలాలు ఈ ప్రాంతాల్లోని వ్యవసాయ స్థిరత్వానికి తోడ్పడతాయి. నీటి లభ్యత పెరగడం వల్ల రైతులు అరటి, బొప్పాయి వంటి వాణిజ్య, ఉద్యానవన పంటల సాగును మరింత పెంచుకునే అవకాశం ఉంది. పరోక్షంగా కూటమికి ఇక్కడ ఓటు బ్యాంకు పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. మొత్తంగా వెలిగొండ.. ప్రజలకు నీటి సిరులు అందిస్తే.. కూటమికి ఓట్ల సిరులు అందించడం ఖాయమని చెబుతున్నారు.

# ఐపీఎల్ ‘ఇంపాక్ట్ ప్లేయర్’ రూల్: ఇక మార్పు తప్పదా? కీలక నిర్ణయం దిశగా బీసీసీఐ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో గత కొన్నేళ్లుగా అత్యంత చర్చనీయాంశంగా మారిన ‘ఇంపాక్ట్ ప్లేయర్’ నిబంధన మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. వచ్చే ఐపీఎల్ సీజన్‌కు ముందు ఈ రూల్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఒక కీలక సమీక్షకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందుకోసం అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీల నుంచి బీసీసీఐ ప్రత్యక్ష అభిప్రాయాలను కోరింది. కేవలం ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపైనే కాకుండా అంపైరింగ్ ప్రమాణాలు, ప్లేయింగ్ కండిషన్స్, ప్రాక్టీస్ సెషన్స్ , ఇతర క్రికెట్ ఆపరేషన్స్‌పై కూడా ఫ్రాంచైజీల నుంచి సలహాలు సేకరిస్తోంది. అయితే వీటన్నింటిలోనూ ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన భవిష్యత్తుపైనే క్రికెట్ వర్గాల్లో అత్యంత ఆసక్తి నెలకొంది.

2023 సీజన్ నుండి అమల్లోకి వచ్చిన ఈ ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన, సాంప్రదాయ టీ20 క్రికెట్ స్వరూపాన్నే పూర్తిగా మార్చివేసింది. ఈ రూల్ ప్రకారం మ్యాచ్ జరుగుతున్న సమయంలో జట్లు తమ 11 మంది సభ్యుల ప్లేయింగ్ ఎలెవన్‌తో పాటు.. పరిస్థితిని బట్టి అదనంగా ఒక స్పెషలిస్ట్ బ్యాటర్ లేదా స్పెషలిస్ట్ బౌలర్‌ను మైదానంలోకి దించే అవకాశం లభించింది. దీనివల్ల జట్లకు అదనపు వ్యూహాత్మక స్వేచ్ఛ లభించినప్పటికీ సంప్రదాయంగా ఉండే ఆల్‌రౌండర్ల ప్రాధాన్యత గణనీయంగా తగ్గిపోయిందనే విమర్శలు తీవ్రమయ్యాయి. ఒక జట్టు బ్యాటింగ్ సమయంలో అదనపు బ్యాటర్‌ను, బౌలింగ్ సమయంలో అదనపు బౌలర్‌ను ఉపయోగించుకునే వెసులుబాటు ఉండటంతో, బ్యాటింగ్, బౌలింగ్ రెండూ చేయగల సహజసిద్ధమైన ఆల్‌రౌండర్ల అవసరం జట్లకు లేకుండా పోయింది.

ఈ నిబంధనపై రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శుభ్‌మన్ గిల్ వంటి పలువురు ప్రముఖ భారతీయ ఆటగాళ్లు గతంలోనే తమ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ వల్ల భారత క్రికెట్‌లో నాణ్యమైన ఆల్‌రౌండర్లు తయారయ్యే అవకాశాలు దెబ్బతింటున్నాయని వారు ఆందోళన చెందారు. దీనికి తోడు, ఈ రూల్ వచ్చిన తర్వాత ఐపీఎల్‌లో భారీ స్కోర్లు నమోదు కావడం సాధారణ విషయంగా మారింది. అదనపు బ్యాటింగ్ ఆప్షన్ ఉండటంతో జట్లు మొదటి ఓవర్ నుంచే వికెట్ల గురించి ఆలోచించకుండా విచక్షణారహితంగా దాడి చేస్తున్నాయి. దీనివల్ల 250 పైచిలుకు స్కోర్లు తేలికగా నమోదవుతూ బౌలర్లపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. అంతిమంగా ఇది బ్యాట్, బాల్ మధ్య ఉండాల్సిన సహజ సమతుల్యతను దెబ్బతీస్తోందనే వాదన బలంగా వినిపిస్తోంది.

ప్రస్తుతానికి ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలను సేకరించే ప్రక్రియ మాత్రమే జరుగుతోంది. రాబోయే రోజుల్లో జట్ల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్, ఆటగాళ్ల అభిప్రాయాలు, గత కొన్ని సీజన్లలో నమోదైన గణాంకాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే బోర్డు తన తుది నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉంది. జట్లకు వ్యూహాత్మక సౌలభ్యాన్ని ఇవ్వడానికి తీసుకొచ్చిన ఈ నిబంధనను యథాతథంగా కొనసాగిస్తారా, కొన్ని మార్పులు చేర్పులతో ఉంచుతారా, లేక పూర్తిగా స్వస్తి పలుకుతారా అనేది ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

# ‘కాక్రోచ్’లను అనుమానించిన సోనమ్ వాంగ్ చుక్

లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవల పాల్గొన్న ఒక పాడ్‌కాస్ట్ ముఖాముఖిలో ఆయన ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సీజేపీ)కి చెందిన ఉద్యమ నేతల తీరుపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పేరుతో సాగే ఉద్యమాల వెనుక ఉండే నాయకుల రాజకీయ ఆశయాలు, వారి అసలు ఉద్దేశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు సామాజిక, రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీశాయి.

**రాజకీయ ఆశయాలు ఉండటంలో తప్పులేదు కానీ..**

సిజెపి నేతలను తాను చాలా కాలంగా.. ఎంతో దగ్గరగా పరిశీలిస్తున్నానని వాంగ్‌చుక్ తెలిపారు. తనకు తెలిసినంతవరకు వారిలో బలమైన రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో ఎవరికైనా రాజకీయ ఆశయాలు ఉండటం సహజమేనని.. అందులో ఎలాంటి తప్పూ లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఒక ప్రజా ఉద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు.. రాజకీయ పార్టీలకు దూరంగా పూర్తి నిష్పాక్షికంగా న్యూట్రల్ గా ఉండటం ఎంతో ముఖ్యమని ఉద్యమ ప్రారంభంలోనే వారికి సూచించినట్లు వాంగ్‌చుక్ వెల్లడించారు. ఉద్యమం నిష్పాక్షికంగా ఉన్నప్పుడే దానికి సామాన్య ప్రజల నుంచి విస్తృత మద్దతు లభిస్తుందని ఆయన విశ్లేషించారు.

**‘వారు సాధువులేమీ కాదు’**

సిజెపి నాయకుల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలను ప్రశ్నిస్తూ వాంగ్‌చుక్ చేసిన వ్యాఖ్యల్లో ‘వారేం సాధువులు కాదు’ అన్న మాటలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఎలాంటి స్వార్థం లేదా రాజకీయ ప్రయోజనం ఆశించకుండా కేవలం ప్రజా సేవకే అంకితమయ్యే స్థాయిలో ఆ నేతలను తాను చూడటం లేదని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఆ నాయకులెవరూ తమ రాజకీయ ఆశయాలను స్వయంగా తనతో పంచుకోలేదని.. కేవలం ఒక పరిశీలకుడిగా తనకున్న అనుభవం బట్టే ఈ అభిప్రాయానికి వచ్చానని స్పష్టం చేశారు.

**‘కాక్రోచ్’ల వెనుక అసలు అంతరార్థం**

సంభాషణలో వాంగ్‌చుక్ వాడిన ‘కాక్రోచ్‌లు’ అనే పదం ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా ప్రజా ఉద్యమాలలో నేరుగా కనిపించకుండా.. సమయాన్ని బట్టి తమ పాత్రను మార్చుకుంటూ వెనుక ఉండి ప్రయోజనాలు పొందే అవకాశవాద వ్యక్తులను ఉద్దేశించి ఈ పదాన్ని వాడి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యక్షంగా ఎలాంటి ఆధారాలు చూపించనప్పటికీ, ఆయన వ్యక్తంచేసిన ఈ అనుమానాలు ఉద్యమ నాయకత్వ విశ్వసనీయతపై పెద్ద ప్రశ్న గుర్తును మిగిల్చాయి.

**ఉద్యమాలు.. రాజకీయాల మధ్య సరిహద్దు ఎక్కడ?**

వాంగ్‌చుక్ వ్యాఖ్యలు ఇప్పుడు ఒక ప్రాథమిక ప్రశ్నకు తెరలేపాయి. ప్రజా సమస్యల కోసం పోరాడే నాయకులకు రాజకీయ ఆశయాలు ఉండకూడదా? పోరాటం ముగిసాక రాజకీయాల్లోకి రావడం సహజ పరిణామమే కదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చరిత్రలో అనేకమంది ఉద్యమకారులు పీపుల్స్ లీడర్లుగా మారి రాజకీయాల్లోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఉద్యమం నడుస్తున్న సమయంలోనే స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారనే భావన ఏర్పడితే ఆ ఉద్యమం తన పవిత్రతను కోల్పోతుందని వాంగ్‌చుక్ పరోక్షంగా హెచ్చరించారు.

సమాజ హితం కోసం వచ్చే నాయకులు ప్రజా ఉద్యమాలను కేవలం తమ రాజకీయ ఎదుగుదలకు నిచ్చెనలుగా వాడుకోకూడదనే ఒక విలువైన సందేశాన్ని సోనమ్ వాంగ్‌చుక్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# కూటమి సంకల్ప బలం ఇదే: పవన్ కల్యాణ్

--కూటమి ప్రభుత్వం ఏదైనా సంకల్పిస్తే.. ఎలా చేస్తుంది.. అనేందుకు ఇదే నిదర్శనం. ఇది కూటమి సంకల్ప బలం-- అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రస్తుతం కేరళలో ఉన్న ఆయన.. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తాజాగా సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించి జాతికి అంకితం చేసిన నేపథ్యంలో పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో స్పందించారు. ఈ ప్రాజెక్టు 30 ఏళ్ల ప్రజల కలలను సాకారం చేసిందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో, మరెన్నో ఆకాంక్షలతో ప్రజలు పట్టం కట్టారని, వారి ఆశలు, ఆకాం క్షలను నెరవేర్చేందుకు ప్రయత్నంతోపాటు.. కృషి కూడా జరుగుతోందన్నారు. తాజాగా వెలిగొండ ప్రాజె క్టు తొలి దశపూర్తిచేసుకుని కృష్ణమ్మ జలాలు.. కరువు పీడిత ప్రాంతాలకు పరవళ్లు తొక్కనున్నాయని తెలి పారు. తద్వారా ఓ చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుందని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాలకు ఎనలేని మేలు జరుగుతందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆయా జిల్లాల్లో సాగు భూములకు జవసత్వాలు అందుతాయని పేర్కొన్నారు. తద్వారా ఇక్కడి కరువు నేలలో ఆశలు చిగురిస్తాయని, వలస వెళ్లే ప్రజలు ఇక్కడే ఉపాధి మార్గాలు, వ్యవసాయం చేసుకునే అవకాశం కూడా లభిస్తుందని పవన్ స్పష్టం చేశారు. తొలి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనున్నాయని పేర్కొన్నారు.

**మరో పోస్టులో..**

రాష్ట్రంలోని పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమంలో మరో పోస్టు పెట్టారు. పారిశ్రామిక వేత్తలు విజ్ఞులని.. వారికి అన్నీ తెలుసునని తనతో చెప్పించుకోవద్దని ఆయన వ్యాఖ్యానించా రు. పర్యావరణానికి హాని చేసేలా వ్యవహరించరాదని తేల్చి చెప్పారు. అనుమతులు తీసుకోకుండా.. కాలం చెల్లిన అనుమతులు రెన్యువల్ చేసుకోకుండా వ్యవహరించడం సరికాదన్నారు. పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలని, రేపటి తరాలకు -పచ్చని- భవిష్యత్తును అందించేందుకు సహకరించాలని సూచించారు. మరోవైపు.. అన్ని భారీ, మధ్య తరహా పరిశ్రమల్లో 33 శాతం పచ్చదనాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలిని పవన్ కల్యాణ్ కోరారు.

## సంపాదకీయం

# రిజర్వేషన్ల రగడ..!

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి చర్చతోపాటు 'జై భీమ్' నినాదాలు మార్మోగిన కొద్ది రోజులకే, అదే వేదికపై పూర్తి భిన్నమైన స్వరం వినిపించింది. 'రిజర్వేషన్ హటావో ఆందోళన' పేరిట రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొత్త ఉద్యమం మొదలైంది. ఈ పరిణామంతో దేశ రాజకీయాల్లో రిజర్వేషన్లపై చర్చ మరోసారి కేంద్రబిందువుగా మారింది. అయితే, అధికార బీజేపీకి ఇది కేవలం విధానపరమైన చర్చ మాత్రమే కాదు, ఎదుర్కోవాల్సిన పెద్ద రాజకీయ సవాలుగా మారింది. ఒకవైపు పార్టీకి దీర్ఘకాలంగా మద్దతిస్తున్న సాధారణ కేటగిరీ (జనరల్ కేటగిరీ) వర్గంలో అసంతృప్తి పేరుకుపోగా, మరోవైపు గత దశాబ్దకాలంలో పార్టీ తన సామాజిక పునాదిని విస్తరించుకున్న ఇతర వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలున్నాయి. మరికొన్ని నెలల్లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో, తన మద్దతుదారుల్లో ఏ ఒక్క వర్గాన్నీ దూరం చేసుకోకుండా ఈ కొత్త డిమాండ్లకు ఎలా స్పందించాలన్నదే బీజేపీ ముందున్న అసలైన ప్రశ్న! అన్‌రిజర్వ్‌డ్ కులాల ఆందోళనలను పరిష్కరిస్తూనే ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో తన మద్దతును పార్టీ నిలుపుకోగలదా? లేక ఒక వర్గానికి భరోసా కల్పించే ప్రయత్నం మరో వర్గంలో అభద్రతా భావాన్ని సృష్టిస్తుందా? అన్నది ఆసక్తికరమైన ప్రశ్నగా నిలిచింది.

2014లో మోదీ శకం ప్రారంభమైనప్పటి నుంచి బీజేపీ ఒక విస్తృత కుల ఆధారిత కూటమిని నిర్మించుకుంది. అంతకుముందు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓట్ల వాటా దాదాపు 22 శాతం ఉంటే, అది క్రమంగా 37 శాతానికి పెరిగింది. సంప్రదాయ ఓటర్లైన అగ్రకులాలను దాటి పార్టీ తన మద్దతును గణనీయంగా విస్తరించుకున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అగ్రకులాల ప్రయోజనాలను కాపాడేది తామేనని ఒకప్పుడు భావించిన ఆ వర్గాలు, పార్టీ విస్తృత కుల కూటమిని నిర్మించుకుంటున్న క్రమంలో తమను పక్కనబెడుతున్నారన్న భావనకు లోనవుతున్నట్టు కనిపిస్తోంది. మోదీ శకం మొదలైన తర్వాత బీజేపీ ప్రధాన ఓటు బ్యాంకులో ఇలాంటి కదలిక కనిపించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నవారు పార్టీ అధిష్ఠానాన్ని కలిసినా, మెరిట్ ఆధారిత రిజర్వేషన్ల డిమాండ్‌కు బీజేపీ బహిరంగంగా మద్దతు ఇవ్వలేకపోతోంది. ఎందుకంటే అలా చేస్తే తాను జాగ్రత్తగా నిర్మించుకున్న ఓబీసీ ఓటు బ్యాంకును కోల్పోయే ప్రమాదముంది. ఇదే సమయంలో, నిరసన తెలుపుతున్న అగ్రకులాల వర్గాలకు ఒక స్పష్టమైన రాజకీయ నాయకత్వం లేకపోవడం గమనార్హం. యువతలో ఉద్యోగావకాశాల కొరత, నాణ్యమైన విద్యకు సంబంధించిన ప్రశ్నలు ముందుకు వస్తున్నా, వీటిని అందిపుచ్చుకుని ఒక నిర్దిష్ట దిశలో నడిపించే ప్రతిపక్ష నాయకత్వం కొరవడటంతో, ఈ ఉద్యమం రాజకీయ అస్థిరతకు సంకేతంగానే మిగిలిపోతోంది. సోషల్ మీడియా ద్వారా ఏర్పడిన ఈ ఉద్యమం ఏ దిశగా పయనిస్తుందో, దాని నుంచి ఉద్భవించే రాజకీయ శక్తి ఎటువైపు మొగ్గుతుందో, రాబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరమే స్పష్టం కానుంది.

రిజర్వేషన్ల నిర్మూలనపై జరుగుతున్న చర్చలో లేవనెత్తుతున్న ప్రధాన వాదనల్లో ఒకటి.. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దళితులకు ఇకపై రిజర్వేషన్లు అవసరం లేదన్నది. అయితే, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్లు వారి ఆర్థిక పరిస్థితి ఆధారంగా మంజూరు కాలేదన్న విషయాన్ని ఈ వాదన విస్మరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రిజర్వేషన్ల నిర్మూలన గురించి చర్చించాలంటే, అది కేవలం ఆర్థిక స్థితిపైనే ఆధారపడకూడదని, సమాజంలో ఆయా వర్గాల స్థానం, గౌరవం, ప్రాతినిధ్యం, న్యాయంవంటి విస్తృత అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల వారికి ఇప్పటికే ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ కేటగిరీని ఏర్పాటు చేసిందని, ప్రతి వర్గం తనకు కేటాయించిన కేటగిరీలోనే పోటీపడాల్సి ఉంటుందని కూడా గుర్తుచేస్తున్నారు. అదే సమయంలో, ఒకే షెడ్యూల్డ్ కులాల వర్గంలోనూ కొన్ని ఉపకులాలు ఎక్కువ రాజకీయ ప్రాతినిధ్యాన్ని పొందుతుండగా, మరికొన్ని ఉపకులాలు ఇప్పటికీ వెనుకబడే ఉండటం మరో సంక్లిష్ట సమస్యగా ముందుకు వస్తోంది. దీనిపై సమగ్ర అధ్యయనం, శ్వేతపత్రం అవసరమన్న డిమాండ్ బలపడుతోంది. వర్శిటీల్లో వైస్ చాన్సలర్ల పదవుల నుంచి న్యూస్‌రూమ్‌ల వరకు, నిర్ణయాధికార స్థానాల్లో అణగారిన వర్గాల ప్రాతినిధ్యం ఇప్పటికీ చాలా తక్కువగానే ఉందని, తాము కేవలం సంక్షేమ ప్రయోజనాలు పొందేవారిగా మిగిలిపోకుండా, నిర్ణయాధికార వ్యవస్థల్లో భాగస్వాములవ్వాలని కోరుకుంటున్నామన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవలి యూజీసీ నిబంధనలు కొంతమేర అసంతృప్తికి, రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమానికి కారణమయ్యాయని చెబుతున్నా, దళిత విద్యార్థుల పీహెచ్‌డీ థీసిస్‌ల సమర్పణలో తరచూ ఎనిమిదేళ్ల వరకు జాప్యం జరుగుతుండటం, ఇంటర్వ్యూల్లో ఈ వర్గాలకు తక్కువ మార్కులు లభిస్తుండటం వంటి వాస్తవ సమస్యలను పరిష్కరించే దిశగా యూజీసీ నోటిఫికేషన్ ఒక ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను, కమిటీని ఏర్పాటు చేసిందని, ఇందులో అన్ని వర్గాల ప్రతినిధులూ భాగస్వాములుగా ఉంటారని కూడా వివరిస్తున్నారు.

ఆధునికత రాకతో రోజువారీ జీవితంలో కులవివక్ష తగ్గుతున్నట్టు కనిపిస్తున్నా, ఎన్నికల ప్రజాస్వామ్యం మాత్రం కుల గుర్తింపును మరింత బలోపేతం చేస్తుండటం పెద్ద వైరుధ్యంగా నిలుస్తోంది. నేటి యువతరం రోజువారీ జీవితంలో, స్నేహితుల మధ్య కులాన్ని పెద్దగా పట్టించుకోకపోయినా, రాజకీయ అంశం ముందుకు వచ్చిన వెంటనే కుల గుర్తింపు మళ్లీ తెరపైకి రావడం గమనార్హం. రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమంలో పదేపదే వినిపిస్తున్న 'మెరిట్' అనే పదం కూడా అత్యంత సాపేక్షమైనదని, దీనికి కులంతో అనివార్యంగా సంబంధం ఉండాల్సిన అవసరం లేదని, ఇది వ్యక్తిగత సామర్థ్యానికి సంబంధించిన అంశం కూడా అని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. అసలు సమస్య పెరుగుతున్న సామాజిక అసమానతేనని, సమాజం నిరంతరం మారుతూ ఉంటుంది కాబట్టి ఈ అసమానతలకూ కొత్త కొత్త అర్థాలు వస్తుంటాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తంమీద, రిజర్వేషన్లపై ప్రస్తుతం జరుగుతున్న చర్చ, కేవలం విధానపరమైన సమస్య మాత్రమే కాదు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అసమానతల మధ్య సున్నితమైన సమతూకాన్ని సాధించాల్సిన సంక్లిష్ట సవాలుగా మిగిలిపోతోంది. ఏ వర్గానికీ అన్యాయం జరగకుండా, అదే సమయంలో దశాబ్దాలుగా అణచివేతకు గురైన వర్గాలకు నిజమైన సాధికారత లభించేలా చూడటమే, భవిష్యత్తులో ఈ చర్చకు సరైన పరిష్కారాన్ని అందించగలదు.

## పనికొచ్చే పలుకు

# సహనమే.. శ్రీరామ రక్ష

ఇంటర్నెట్ మన జీవితాలను సులభతరం చేయడమే కాకుండా, మన అలవాట్లను, ఓర్పునూ మార్చేసింది. ఒకప్పుడు ఎవరితోనైనా మాట్లాడాలంటే ఓపికగా ఉండేవాళ్లం. ఉత్తరం రాయాలంటే వారాలు పట్టేది. తిరిగి జవాబు రావాలంటే.. మరిన్ని వారాలు ఎదురు చూడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రిప్లై ఆలస్యమైతేనే ఏదో జరిగిపోయిందని కంగారు పడుతున్నాం. ఖాళీ దొరికితే చాలు ఆటోమేటిక్‌గా ఫోన్ చూస్తున్నాం. సమాచారం, వినోదం ఇలా ప్రతిదీ వెంటనే రావాలనుకోవడం మనలోని సహనం అనే గొప్ప గుణాన్ని పూర్తిగా తగ్గించేస్తోంది. రచయిత్రి జాయిస్ మేయర్ చెప్పిన ఒక ప్రసిద్ధ మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి: *Patience is not the ability to wait, but the ability to keep a good attitude while waiting.* అంటే, ఓపిక అంటే కేవలం వేచి చూడగలగడం కాదు, వేచి చూస్తున్నప్పుడు మంచి మనోభావాన్ని కొనసాగించగలగడం. కానీ మనం కొద్దిపాటి వేచి చూడాల్సిన సమయంలోనూ ఆందోళన, చిరాకు, అసహనానికి లోనవుతున్నాం. అంటే, సమస్య వేచి చూడటంలో లేదు, వేచి చూసేటప్పుడు మన మనసు ఎలా స్పందిస్తుందన్నదే అసలైన సవాలు. ఈ మార్పు వెనుక ఉన్న శాస్త్రీయ కారణాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. ప్రతిసారీ నోటిఫికేషన్ వచ్చినప్పుడు, మెసేజ్‌కు రిప్లై వచ్చినప్పుడు, మన మెదడులో డోపమైన్ అనే 'ఆనంద హార్మోన్' విడుదలవుతుంది. ఇది మళ్లీ మళ్లీ ఫోన్ చూడాలని కోరుకునేలా చేస్తుంది. దీర్ఘకాలంలో ఇది మెదడు నిర్మాణాన్నే మారుస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. నిదానంగా ఆలోచించే సామర్థ్యం తగ్గి, తక్షణ సంతృప్తి కోసం అర్రులు చాచే ధోరణి పెరుగుతుంది. దీన్నే మనస్తత్వశాస్త్రంలో 'ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్ ట్రాప్' అంటారు. ఈ మార్పు మన జీవితంపై చూపే ప్రభావం అనేక రూపాల్లో కనిపిస్తుంది. సంబంధాల్లో, ఎవరైనా మెసేజ్‌కు వెంటనే స్పందించకపోతే ప్రతికూల అర్థాలు తీసుకుంటాం. "నన్ను పట్టించుకోవడం లేదు", "ఏదో తప్పు జరిగింది" అని ఆందోళన చెందుతాం. ఎందుకంటే మనసు తక్షణ ఫలితాల కోసం ఆరాటపడుతుంది. వ్యక్తిగత ఎదుగుదలలో, నైపుణ్యాలు నేర్చుకోవడానికి, అలవాట్లను మార్చుకోవడానికి అవసరమైన సమయాన్ని ఇవ్వకుండా, వెంటనే ఫలితాలు కనిపించకపోతే మధ్యలోనే వదిలేస్తాం.

ఈ పరిస్థితిని మార్చుకోవడానికి కొన్ని ఆచరణాత్మక మార్గాలు ఉన్నాయి. మొదటిది.. రోజులో కొన్ని నిర్దుష్ట సమయాల్లో మాత్రమే ఫోన్ నోటిఫికేషన్లను చూడండి. నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం లేదని మీ మెదడుకు నేర్పించండి. రెండోది.. ఉద్దేశపూర్వకంగా వేచి చూసే అభ్యాసం చేయండి. క్యూలో నిలబడినప్పుడు వెంటనే ఫోన్ తీయకుండా, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించండి. మూడోది.. దీర్ఘకాలిక లక్ష్యాలను చిన్న మైలురాళ్లుగా విభజించి, ప్రతి చిన్న పురోగతినీ జరుపుకోండి. ఇది తక్షణ సంతృప్తి కోరికను ఆరోగ్యకరమైన రీతిలో తీర్చుతుంది. నాలుగోది, రోజుకు కొంత సమయం పూర్తిగా డిజిటల్ పరికరాలకు దూరంగా గడపండి –పుస్తకం చదవడం, నడక వంటివి మెదడుకు నిదానంగా ఆలోచించే అలవాటును తిరిగి నేర్పిస్తాయి. గుర్తుంచుకోండి –ఓపిక పుట్టుకతో వచ్చే గుణం కాదు, అభ్యాసంతో సాధించే నైపుణ్యం. ఇంటర్నెట్ మనకు వేగాన్ని ఇచ్చినా, జీవితంలో నిజంగా విలువైనవన్నీ – మంచి సంబంధాలు, లోతైన జ్ఞానం, స్థిరమైన విజయం – సమయం తీసుకునేవే. వేచి చూడాల్సిన క్షణాల్లో మీ మనోభావాన్ని ప్రశాంతంగా ఉంచుకోగలిగితే, అదే మీ నిజమైన శక్తిగా మారుతుంది.

# నేపాల్ వేదన.. భారత్‌కు హెచ్చరిక!

**ఇప్పుడైనా భారత్ నేర్చుకుంటుందా? తన బాధను నేపాల్ చెబుతున్నప్పటికీ, ఇన్నాళ్లూ వినడానికి నిరాకరించిన ఆ గుణపాఠాన్ని ఇకనైనా వినగలదా? హిమాలయాలు వేర్వేరు దేశాల ప్రత్యేక భాగాలు కాదు - అఫ్గానిస్తాన్ నుంచి భూటాన్ వరకు, ఇవన్నీ ఒకే సజీవ శిల, భూకంప శక్తులతో, హిమానీనద కదలికలతో నిండి ఉన్న ప్రమాదకర నిర్మాణం. ఆగస్టు 27న నేపాల్‌లో సంభవించిన విషాదం, ఎగువన జరిగింది దిగువన జరిగితే భారత్ సన్నద్ధత సరిపోతుందా అన్న ప్రశ్నను లేవనెత్తుతోంది. చైనా నిర్మిస్తున్న మెడోగ్ జలవిద్యుత్ ప్రాజెక్టు, భూకంప ప్రమాదకర పైజెన్ ఫాల్ట్‌కు అత్యంత సమీపంలో ఉండటం, ఈశాన్య భారత్‌కు మరో పెను ముప్పుగా మారే అవకాశం ఉంది. చిన్న పొరుగుదేశం చెల్లించిన మూల్యం నుంచి నేర్చుకోకపోతే, రేపు అదే అద్దంలో భారత్ కూడా కనిపించే ప్రమాదం ఉంది.**

ఇప్పుడైనా భారత్ నేర్చుకుంటుందా? తన బాధను నేపాల్ చెబుతున్నప్పటికీ, ఇన్నాళ్లూ వినడానికి నిరాకరించిన ఆ గుణపాఠాన్ని ఇకనైనా భారత్ వినగలదా? హిమాలయాలు వేర్వేరు ప్రత్యేక భాగాలుగా విడిపోయినవి కావు. అఫ్గానిస్తాన్ హిందూకుష్ హిమాలయాలు, పాకిస్తాన్ హిమాలయాలు, భారత హిమాలయాలు, నేపాల్ హిమాలయాలు, టిబెట్–చైనా, భూటాన్‌లోని హిమాలయాలు.. ఇవన్నీ ఒకే సజీవ శిల. నిశ్శబ్దంగా, గంభీరంగా, భూకంప శక్తులతో, హిమానీనద కదలికలతో, భౌగోళిక అలజడులతో నిండివున్న ఒకే ఒక్క సజీవ నిర్మాణమిది. ఎప్పుడు, ఎక్కడ, ఎంత తీవ్రతతో దాడి చేస్తుందో ఎవరూ ఊహించలేని రీతిలో అది తన మౌన ఆలోచనలను ఆకస్మిక కుదుపులతో వ్యక్తం చేస్తుంది. నదులు తమ మార్గాలనుంచి బలవంతంగా తొలగించబడటం, రాళ్లు, కొండచరియలు విరిగిపడి బురద, పూడికతో మానవ నివాసాలను శిథిలాలుగా, సారవంతమైన పొలాలను బురద మయంగా మార్చేయడం.. ఇలాంటి విపత్తులు అక్కడి నుంచి ఎలా వెలువడతాయో ఎవరూ కచ్చితంగా ఊహించలేరు. 1934 నాటి నేపాల్–బిహార్ భూకంపం లేదా 1950నాటి అస్సాం భూకంపం గురించి తల్లిదండ్రుల నుంచి, తాతల నుంచి విన్నవారిని అడిగితే, ఆ దుఃస్వప్నాన్ని వారు వివరిస్తారు. ఉత్తర భారతదేశంలో పెద్ద భూభాగాన్ని కుదిపేసే సామర్థ్యం గల భారీస్థాయి భూకంపం రాబోతోందని భూకంప శాస్త్రవేత్తలు ప్రపంచానికి, ప్రత్యేకించి భారత్‌కు హెచ్చరించారు. ఈ హెచ్చరికను భారత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కాదు, విపత్తు నిర్వహణ సంస్థలు చెబుతున్నట్టు, ఈ ముప్పుపట్ల అప్రమత్తంగా ఉండటానికి చాలా చేసింది కూడా. కానీ ఆగస్టు 27న నేపాల్‌లో సంభవించిన విషాదం తర్వాత మనం అడగాల్సిన, తెలుసుకోవాల్సిన ప్రశ్న ఏమిటంటే.. ఎగువ నేపాల్‌లో జరిగింది దిగువ నేపాల్‌లో, అంతకంటే దిగువన కూడా జరిగివుంటే, నదీతీర నివాసాలను తక్షణ మృత్యువు నుంచి కాపాడటానికి మన 'సన్నద్ధత' సరిపోయేదా? మరింత సూటిగా చెప్పాలంటే, గ్లోబల్ వార్మింగ్ ప్రేరేపిత హిమానీనద సరస్సు విస్ఫోటన వరదల భయానక దృగ్విషయం గురించి, భారత్‌లో అలాంటి ముప్పు ఉన్న ప్రాంతాల్లో నివసించే ప్రజలను అధికారులు హెచ్చరించారా? ఎదుర్కోవడం ఎలాగో సలహా ఇచ్చారా? అన్నది మనం తెలుసుకోవాలి. నిజం చెప్పాలంటే, భూకంప, హిమానీనద, వాతావరణ, భౌగోళిక పరిజ్ఞానం విషయంలో మనం అమాయకంగానే ఉన్నాం. మన భూశాస్త్రవేత్తలకు ఇదంతా తెలుసు, కానీ వారి జ్ఞానం గురు–ముష్టిలో బిగించుకున్నట్టు పరిమితంగానే ఉండిపోతోంది. బుధవారం నేపాల్‌లో ఏం జరిగిందో ఇంకా పూర్తిగా అంచనా వేయాల్సి ఉంది. భూకంపమే జీఎల్ఓఎఫ్‌కు కారణమైందా? లేక జీఎల్ఓఎఫ్ ఫలితంగానే భూమికంపించి, జలాశయాలు భయానకంగా ఉప్పొంగాయా? అన్నది త్వరలోనే తెలుస్తుంది.

ఏ క్రమంలో జరిగినా, భారత్ నేర్చుకోవాల్సిన గుణపాఠాలు స్పష్టంగా కేకలు వేస్తున్నాయి. మొదటిది.. ఊహ తెలిసినప్పటి నుంచీ పవిత్రంగా భావించే హిమాలయాలు, 'ఖచ్చితమైన' ప్రమాదాన్నీ గర్భంలో మోస్తున్నాయి. రెండోది.. ఈ ప్రమాదాలను ఇకపై కేవలం సదస్సులు, సాంకేతిక పత్రాలకే పరిమితం చేయకూడదు. మూడోది.. వీటిని యుద్ధప్రాతిపదికన స్పష్టమైన బాధితులమయ్యే మనకు తెలియజేయాలి. నాలుగోది.. కేవలం జ్ఞానాన్ని పెంచడం కాదు, కొత్త రక్షణ వ్యవస్థలో భాగస్వాములను చేయడం ద్వారా తెలియజేయాలి. ఐదోది.. మన పండిత–దౌత్యవేత్త శ్యామ్‌శరణ్ ఇటీవల ద ట్రిబ్యూన్, ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలో రాసిన రెండు కీలక వ్యాసాల్లో, బ్రహ్మపుత్ర నదికి భారత్ సరిహద్దుకు అవతల, పైజెన్ ఫాల్ట్‌కు అత్యంత సమీపంలో చైనా నిర్మిస్తున్న మెడోగ్ ప్రాజెక్టు (ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు) గురించి హెచ్చరించారు. ఈ ప్రాంతంలో పెద్ద భూకంపం సంభవిస్తే, ఈశాన్య భారత్‌లోకి భారీ వరద జలాలు, శిథిలాలు వెల్లువెత్తే ప్రమాదముందని ఆయన స్పష్టం చేశారు. చైనా భూవిజ్ఞాన శాస్త్రవేత్తలే ఈ ప్రాజెక్టు స్థలం కింద ప్లీస్టోసీన్ యుగం నుంచి క్రియాశీలంగా ఉన్న పైజెన్ ఫాల్ట్‌ను గుర్తించడం గమనార్హం. చైనాతో సరిహద్దుల్లో పరిణతితో కూడిన సభ్యతను నెలకొల్పాలన్న భారత్ ప్రయత్నాలు, మెడోగ్ ప్రాజెక్టు కలిగించే భయానక ప్రమాదం గురించి నిష్కపటమైన చర్చను కూడా ఇప్పుడు తప్పనిసరిగా చేర్చుకోవాలి. ఆరోది.. అధిక–రిస్క్ మండలాల్లో ఉన్న ఆనకట్టలు, రియాక్టర్ల వంటి భారత్ సొంత నిర్మాణ ప్రమాదాలను తక్షణం సమీక్షించి, నిజమైన 'దుష్టశక్తుల'ను తొలగించడం ఇక వాయిదా వేయలేని పని. ఏడోది.. కష్టతరమైనా, అంతే ముఖ్యమైనది, అధిక–రిస్క్ మండలాల్లో మానవ జనావాసాలను క్రమబద్ధంగా, కానీ కాలపరిమితితో కూడిన రీతిలో తగ్గించడం. ఎనిమిదోది.. బాహ్య శత్రువుపై కచ్చితత్వంతో, అతిక్రమణలు లేకుండా సర్జికల్ దాడులు చేయగలిగితే, మన శ్రేయస్సు కోసం ఉద్దేశించినా ఇప్పుడు ప్రమాదంగా మారిన నిర్మాణాలను నిర్వీర్యం చేయడానికి కూడా అలాంటి పౌర సమానమైన చర్యలను వినియోగించాలి.

సీఎఫ్ ఆండ్రూస్, వెరియర్ ఎల్విన్, జేబీఎస్ హాల్డేన్ సంప్రదాయానికి చెందిన బ్రిటిష్ భారత భక్తురాలు మార్జోరీ సైక్స్ ఒకసారి ఆవేశంగా ఇలా అన్నారు: "ఆనకట్టలే శాపం." అన్ని ఆనకట్టలూ శాపం కాకపోవచ్చు, కానీ కొన్ని, వాటి స్థానాన్ని బట్టి, నిజంగానే శాపంగా మారతాయి. అలాగే, కొన్ని రియాక్టర్లు రాక్షసులుగా మారవచ్చు. కొన్ని వాణిజ్య దిగ్గజాలు కూడా దోపిడీపరులుగా మారవచ్చు. ఒక పెద్ద, గొప్ప దేశం తన చిన్న పొరుగుదేశపు అనుభవం నుంచి నేర్చుకోగలదు – ప్రత్యేకించి, రెండు దేశాలూ సమాధిగా మారే ప్రమాదమున్న అదే సజీవ శిలపైనే నిలబడి ఉన్నప్పుడు. నేపాల్ చెల్లించిన మూల్యం భారత్‌కు ఒక అద్దం లాంటిది. దాన్ని చూసి కూడా మనం మారకపోతే, రేపు ఈ అద్దంలో మనమే కనిపించే ప్రమాదం ఉండొచ్చు, చెప్పలేం! ■



ఓటమి ఒక్కోసారి బాధ కలిగించడం సహజమే. అంతకుమించి.. ఓటమిలో ఇతరులు మిమ్మల్ని సరిగా అర్థం చేసుకోకపోవడమే కొన్నిసార్లు ఎక్కువ బాధ కలిగిస్తుంది. నిజానికి -ఓటమి ఎదురైనా తట్టుకొని మళ్లీ నిలబడవచ్చు. గెలుపుకోసం మళ్లీ ఓటమినే ఆయుధంగానూ మలచుకోవచ్చు. కానీ, ఇతరుల మెప్పు కోసం ఎదురుచూస్తే.. నిరంతరం మిమ్మల్ని మీరు మార్చుకుంటూ పోతే.. అది మీ వ్యక్తిత్వాన్నే నెమ్మదిగా చంపేస్తుంది. సో, ఇతరుల కోసం కాకుండా, మీరు నిజంగా నమ్మే దాన్ని నిర్మించుకోవడంపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించండి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# బండారం బట్టబయలు!

తైవాన్‌లో ఒక వ్యక్తి తన భార్య వివాహేతర సంబంధాన్ని రోబో వాక్యూమ్ క్లీనర్‌తో రికార్డు చేసినందుకు ఐదు నెలల జైలు శిక్షను ఎదుర్కొన్నాడు. 2021లో వివాహమాడిన ఈ జంట తల్లిదండ్రులతో కలిసి నివసిస్తుండగా, 2023లో వారి సెలవుల ఇంటికి వెళ్లినప్పుడు అనుమానాస్పద టూత్‌బ్రష్ కనిపించడంతో భర్తకు అనుమానం మొదలైంది. మొదట భార్య బుకాయించడంతో నమ్మేసినా, మూడు నెలల తర్వాత ఆమెను ఆశ్చర్యపరచాలని మొబైల్ యాప్ ద్వారా రిమోట్‌గా రోబో వాక్యూమ్ ఆన్ చేయగా, భార్య మరో వ్యక్తితో పడకగదిలో ఉండటం కంటపడింది! తక్షణమే ఎదుర్కోకుండా, న్యాయపరమైన ఆధారంగా ఉపయోగపడేలా రికార్డింగ్ కొనసాగించాడు. ఈ వీడియో ఆధారంగా భార్య, ఆమె ప్రియుడిపై 68,000 డాలర్ల నష్టపరిహారం కోరుతూ కోర్టుకెళ్లగా, న్యాయస్థానం 16,500 డాలర్లు చెల్లించాలని ఆదేశించింది. అయితే, భార్య దాఖలు చేసిన ప్రతి దావాలో, సమ్మతి లేకుండా ప్రైవేటు క్షణాలను రికార్డు చేయడం చట్టవిరుద్ధమని కోర్టు తేల్చడంతో, విజయం అతడికి చేదుగా మారింది. వైవాహిక బాధ్యతలు వ్యక్తిగత గోప్యతా హక్కును అధిగమించలేవని స్పష్టం చేస్తూ, అతడికే ఐదు నెలల జైలు శిక్ష, జరిమానా విధించారు!

## నెలనెలా మహిళల్లో వచ్చే హార్మోన్ల మార్పుల సమస్యలకు పరిష్కారం ఏమిటి.. నిపుణులు ఏం చెబుతున్నారు..?

ప్రతి నెలా పీరియడ్స్ సమయంలో చాలామంది మహిళలు కడుపు నొప్పి, అలసట, ఉబ్బరం, మూడ్ స్వింగ్స్, తీపి పదార్థాలపై కోరిక వంటి సమస్యలను ఎదుర్కొంటుంటారు. హార్మోన్లలో మార్పులు, రక్తస్రావం, కండరాల సంకోచాల కారణంగా ఈ సమయంలో శరీరానికి ఐరన్, మెగ్నీషియం వంటి కొన్ని పోషకాలు మరింత అవసరం అవుతాయి. అయితే రోజువారీ ఆహారంలో పాటించే కొన్ని అలవాట్లు ఈ అసౌకర్యాలను మరింత పెంచే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పీరియడ్స్ సమయంలో తీవ్రమైన కడుపు నొప్పి, అలసట ఉన్నప్పుడు చాలామంది టీ లేదా కాఫీపై ఆధారపడుతుంటారు. కెఫీన్‌ను అధికంగా తీసుకోవడం వల్ల క్రాంప్స్, అలసట మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. కెఫీన్‌లో ఉండే టానిన్లు ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తాయి. రక్తనాళాల సంకోచానికి కూడా కారణమయ్యే అవకాశం ఉంటుంది. దీనికి బదులుగా వెచ్చని వాము నీటిని తీసుకోవడం ఒక ప్రత్యామ్నాయంగా చెబుతున్నారు.

### చిన్న మొత్తంలో తినాలి..

పీరియడ్స్ సమయంలో హార్మోన్ల స్థాయిలు తగ్గడం వల్ల మూడ్‌ను ప్రభావితం చేసే మెదడులోని రసాయనాల్లో మార్పులు వస్తాయి. ఈ సమయంలో కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయడం వల్ల మూడ్ స్వింగ్స్, శక్తి తగ్గడం మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల వేడిగా, తేలికగా తీసుకునే బజ్రా ఖిచ్డీ లేదా రాజ్‌గిరా వంటి ఆహారాలను చిన్న మొత్తంలో తీసుకోవచ్చు. పీరియడ్స్ సమయంలో తీపి పదార్థాలపై తీవ్రమైన కోరిక కలగడం కూడా సాధారణమే. ఇలాంటి సమయంలో ప్రాసెస్ చేసిన చాక్లెట్లను ఎక్కువగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి, మొటిమల సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. చాక్లెట్లకు బదులుగా వేయించిన శనగలు లేదా నల్ల నువ్వులను బెల్లంతో కలిపి తీసుకోవచ్చు. అలాగే నువ్వుల బెల్లం లడ్డూలను కూడా ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు.

### సులభంగా జీర్ణం అవ్వాలి..

పీరియడ్స్ సమయంలో జీర్ణక్రియపై కూడా దృష్టి పెట్టాలి. ఈ సమయంలో శరీరానికి వేడి, సులభంగా జీర్ణమయ్యే ఆహారం అవసరమవుతుంది. పచ్చి లేదా చల్లని ఆహారాలను జీర్ణం చేసుకోవడానికి శరీరానికి ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. దీంతో కొందరిలో కడుపు అసౌకర్యం లేదా క్రాంప్స్ మరింత ఇబ్బంది పెడుతుంది. అందువల్ల చల్లని సలాడ్లకు బదులుగా వేడి మసూర్ దాల్ వంటి సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. పీరియడ్స్ సమయంలో విపరీతమైన అలసట, నీరసం అనిపించినప్పుడు దాన్ని సాధారణంగానే తీసుకోకూడదు. రక్తస్రావం కారణంగా శరీరంలోని ఐరన్ నిల్వలు తగ్గే అవకాశం ఉంటుంది. ఐరన్ అవసరాలను తీర్చుకోవడంలో సహాయపడేందుకు నిమ్మరసంతో కలిపిన నీటిలో నానబెట్టిన ఒక టేబుల్‌స్పూన్ హాలిమ్ విత్తనాలను తీసుకోవాలి. పీరియడ్స్ సమయంలో ఆహారపు అలవాట్లు కూడా శారీరక అసౌకర్యంపై ప్రభావం చూపిస్తాయి. అధికంగా టీ, కాఫీ తీసుకోవడం, కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయడం, ప్రాసెస్ చేసిన చాక్లెట్లను ఎక్కువగా తినడం వంటి అలవాట్లకు బదులుగా వెచ్చని, సులభంగా జీర్ణమయ్యే, పోషకాలు కలిగిన ఆహారాలను ఎంచుకోవడం ద్వారా అవసరమైన పోషకాలను అందించవచ్చు.

## కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వాళ్లు బీట్‌రూట్ తినవచ్చా..?

మధుమేహం అధిక రక్తపోటు మారిన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా బీట్‌రూట్ కిడ్నీ రోగులకు మంచిదా..? లేక హానికరమా..? అనే సందేహానికి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్ అండ్ డైజెస్టివ్ అండ్ కిడ్నీ డిసీజెస్ ప్రకారం.. కాల్షియం ఆక్సలేట్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటే కిడ్నీలో రాళ్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాంటి వారు ఆక్సలేట్ ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. బీట్‌రూట్ కూడా అలాంటి ఆహారాల్లో ఒకటి. అయితే కిడ్నీ బాధితులు బీట్‌రూట్‌ను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. కాల్షియం ఆక్సలేట్ రాళ్ల సమస్య లేకపోతే.. వైద్యులు లేదా డైటీషియన్ సలహా మేరకు పరిమిత మోతాదులో బీట్‌రూట్ తీసుకోవచ్చు. అంటే, బీట్‌రూట్ తినాలా.. వద్దా..? అనేది మీకు ఉన్న కిడ్నీ సమస్య రకాన్ని బట్టి నిర్ణయించాలి. వైద్యుల సలహా లేకుండా ఆహారంలో పెద్ద మార్పులు చేయకపోవడం మంచిది. కాల్షియం ఆక్సలేట్ రాళ్లు వచ్చే ప్రమాదం ఉన్నవారు ఈ కింది ఆహారాలను పరిమితంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటిలో పాలకూర, బీట్‌రూట్, బాదం, వేరుశెనగ, చాక్లెట్, అధిక ఉప్పు,

ప్రాసెస్ చేసిన ఆహారాలు, ప్యాక్ చేసిన స్నాక్స్, చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలు, వీటిని కూడా తగ్గించడం మంచిది. కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యులు లేదా పోషకాహార నిపుణులు సూచించిన ఆహారాన్నే పాటించాలి. సాధారణంగా తగినంత నీరు తాగడం, తాజా పండ్లు, తక్కువ ఆక్సలేట్ ఉన్న కూరగాయలు, తృణ ధాన్యాలు, అవసరమైన మోతాదులో ప్రొటీన్ తీసుకోవడం మంచిది. అలాగే ఉప్పు వినియోగాన్ని తగ్గించి, ప్యాక్ చేసిన, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి. వైద్యుల సూచనల మేరకు ఆహారం తీసుకోవడమే కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉత్తమ మార్గం అని చెప్పవచ్చు.

## ఉప్పు ఎక్కువగా తింటే శరీరంలో కాల్షియం లోపిస్తుందా..?

ఉప్పు మన రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఉండే పదార్థం. ఏ వంటలోనైనా ఉప్పు లేకపోతే అసలు రుచే ఉండదు. అందుకే 'అన్నేసి చూడు.. నన్నేసి చూడు' అని ఉప్పు గర్విస్తుందని పెద్దలు చెబుతుంటారు. ఉప్పు నాడీవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. అయితే ఈ ఉప్పును అధికంగా తింటే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవడం ఆరోగ్యకరం. అధిక ఉప్పు వాడకం రక్తపోటును పెంచుతుంది. గుండె సమస్యలకు, కిడ్నీ సమస్యలకు దారితీస్తుంది. అంతేకాకుండా అధికంగా ఉప్పు తీసుకోవడంవల్ల శరీరంలో ఉన్న కాల్షియం మూత్రం ద్వారా ఎక్కువగా బయటకు వెళ్తుంది. దాంతో కాల్షియం లోపం వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాల్షియం ఎముకలు, దంతాల బలానికి చాలా అవసరం. కాబట్టి ఉప్పు ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కాల్షియం తగ్గి, ఎముకల బలహీనతకు దారితీస్తుంది. ఈ ఎముకల బలహీనత అనేది ముఖ్యంగా ఇప్పటికే కాల్షియం లోపం ఉన్నవారిలో, వృద్ధుల్లో, మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అయితే ఈ సమస్య ఉన్నవాళ్లు ఉప్పును పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. మితంగా తీసుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. అదేవిధంగా పాలు, పెరుగు, ఆకుకూరలు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. సరైన ఆహార అలవాట్లు పాటిస్తే ఉప్పువల్ల వచ్చే కాల్షియం లోపాన్ని తగ్గించుకోవచ్చు.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారికి ఎంతో మేలు చేసే వాకింగ్.. ఎలా పనిచేస్తుందంటే..

ఫ్యాటీ లివర్ సమస్య ప్రస్తుతం చాలామందిలో కనిపిస్తోంది. అధిక బరువు, మధుమేహం, కొలెస్ట్రాల్ పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి జీవనశైలి కారణాలతో కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. ఈ సమస్యను నియంత్రించడానికి ఆహారంలో మార్పులతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా ముఖ్యమే. అయితే ఖరీదైన వర్కౌట్స్ చేయాల్సిన అవసరం లేకుండా రోజువారీ వేగవంతమైన నడకతోనే కాలేయ ఆరోగ్యానికి ప్రయోజనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకునే సామర్థ్యం పెరుగుతుంది. నడిచేప్పుడు కండరాలు ఎక్కువ గ్లూకోజ్, శక్తిని ఉపయోగిస్తాయి. దీనివల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడి రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. అలాగే కాలేయంలో కొవ్వు నిల్వ అవడానికి కారణమయ్యే కొన్ని మెటబాలిక్ సమస్యలను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుంది.

### నొప్పులు, వాపులు తగ్గేందుకు..

వేగంగా నడవడం వల్ల శరీరం ఎక్కువ శక్తిని ఖర్చు చేస్తుంది. దీంతో కాలక్రమేణా శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును ఉపయోగించుకునే అవకాశం పెరుగుతుంది. అలాగే కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో, శరీరంలో వాపును తగ్గించడంలో కూడా క్రమం తప్పకుండా వ్యాయామం సహాయపడుతుంది. ఇవన్నీ ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన ముఖ్యమైన కారకాలను నియంత్రించడంలో ఉపయోగపడతాయి. కాలేయ ఆరోగ్యం కోసం వారానికి 150 నుంచి 300 నిమిషాల మోస్తరు తీవ్రత కలిగిన శారీరక శ్రమ చేయాలని సూచిస్తున్నారు. అంటే రోజుకు సుమారు 30 నుంచి 45 నిమిషాల పాటు ఎక్కువ రోజులు బ్రిస్క్ వాకింగ్ చేయవచ్చు. ప్రస్తుతం వ్యాయామం చేయని వారు మొదటి రోజే ఎక్కువసేపు నడవాల్సిన అవసరం లేదు. తక్కువ సమయంతో ప్రారంభించి, క్రమంగా నడక సమయం, వేగాన్ని పెంచుకోవచ్చు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న మార్పులు కూడా శారీరక శ్రమను పెంచుతాయి. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఉపయోగించడం, పని మధ్యలో కొద్దిసేపు నడవడం, భోజనం తర్వాత నడవడం వంటి అలవాట్లు మొత్తం శారీరక కదలికను పెంచుతాయి. అప్పుడప్పుడు మాత్రమే వ్యాయామం చేయడం కంటే ప్రతిరోజూ కదలికను ఒక అలవాటుగా మార్చుకోవడం ముఖ్యమని నిపుణుల సూచనలు చెబుతున్నాయి.

### నడకతోనే సమస్య తీరదు..

అయితే నడకతోనే ఫ్యాటీ లివర్ పూర్తిగా నయం అవుతుందని భావించకూడదు. నడక కాలేయంలో పేరుకున్న కొవ్వును తగ్గించడంలో, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ వంటి మెటబాలిక్ అంశాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కానీ ఫ్యాటీ లివర్ తీవ్రత, శరీర బరువు, ఆహారం, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్, శారీరక శ్రమ, కాలేయ వ్యాధి దశ వంటి అనేక అంశాలపై ఫలితం ఆధారపడి ఉంటుంది. బరువు తగ్గడం కూడా కాలేయ ఆరోగ్యానికి అదనపు ప్రయోజనాన్ని అందిస్తుంది. శరీర బరువులో సుమారు 5 శాతం తగ్గడం కాలేయంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. 7 నుంచి 10 శాతం వరకు బరువు తగ్గితే కాలేయంలోని వాపు మెరుగుపడటానికి, ప్రారంభ దశలో ఉన్న కాలేయ నష్టాన్ని కొంతమందిలో తగ్గించడానికి అవకాశం ఉంటుంది. అయితే బరువు తగ్గడం వెంటనే కనిపించకపోయినా వ్యాయామం ఆపకూడదు. వ్యాయామం వల్ల బరువులో పెద్ద మార్పు లేకపోయినా కాలేయానికి ప్రయోజనం కలుగుతుంది.

### హారమూ ముఖ్యమే..

ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడానికి నడకతోపాటు సమతుల్యమైన ఆహారం కూడా అవసరం. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువ కొవ్వు కలిగిన ప్రోటీన్ ఆహారాలను తీసుకోవడం మంచిది. చక్కెర కలిగిన పానీయాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, సంతృప్త కొవ్వులు ఎక్కువగా ఉండే పదార్థాలను పరిమితం చేయాలి. నడకకు తోడు వారానికి రెండు నుంచి మూడు సార్లు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ లేదా రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయడం కూడా ఉపయోగపడుతుంది. ఇవి కండరాలను బలోపేతం చేయడంతోపాటు శరీరం గ్లూకోజ్‌ను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. మంచి నిద్రతోపాటు మధుమేహం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలను నియంత్రించడం కూడా ఫ్యాటీ లివర్ నిర్వహణలో కీలకం. ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన మరో ముఖ్యమైన విషయం.. ప్రారంభ దశలో చాలామందికి ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. ఎలాంటి అసౌకర్యం లేకపోయినా కాలేయంలో కొవ్వు పేరుకుపోయి ఉంటుంది. సమస్యను నిర్లక్ష్యం చేస్తే కొంతమందిలో కాలేయంలో వాపు, ఆపై ఫైబ్రోసిస్ లేదా మచ్చలు ఏర్పడే అవకాశం ఉంటుంది. పరిస్థితి మరింత తీవ్రమైతే సిరోసిస్, కాలేయ వైఫల్యం వంటి సమస్యలు వస్తాయి. కాలేయ క్యాన్సర్ ప్రమాదం కూడా పెరుగుతుంది.

### వైద్య పర్యవేక్షణ అవసరం..

అందుకే ఫ్యాటీ లివర్ ఉన్నట్లు ఇప్పటికే నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా వైద్య పర్యవేక్షణలో ఉండటం మంచిది. అవసరాన్ని బట్టి రక్త పరీక్షలు, స్కానింగ్ లేదా ఇతర పరీక్షలను వైద్యులు సూచిస్తారు. మధుమేహం, అధిక బరువు లేదా కాలేయ పరీక్షల్లో అసాధారణ ఫలితాలు ఉన్నవారు కూడా కాలేయ ఆరోగ్యం గురించి వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడంలో రోజువారీ బ్రిస్క్ వాకింగ్ ఒక సులభమైన, అందుబాటులో ఉండే అలవాటు. రోజూ వేసే ప్రతి అడుగు కాలేయ ఆరోగ్యానికి ఉపయోగపడే జీవనశైలి మార్పులో భాగమే. నడకతోపాటు ఆరోగ్యకరమైన ఆహారం, బరువు నియంత్రణ, స్ట్రెంగ్త్ వ్యాయామాలు, మంచి నిద్ర, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యల నియంత్రణను కలిపి కొనసాగిస్తే ఫ్యాటీ లివర్ ను మరింత మెరుగ్గా నిర్వహించవచ్చు.

# 15 ఏళ్లకే సంచలనం.. దులీప్ ట్రోఫీలో 57 ఏళ్ల రికార్డు బద్దలుకొట్టిన వైభవ్ సూర్యవంశీ

**15 ఏళ్ల 175 రోజులకే హాఫ్ సెంచరీ సాధించి చరిత్ర సృష్టించిన యువ బ్యాటర్**

**సెంట్రల్ జోన్‌పై కేవలం 42 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి**

**గత మ్యాచ్‌లో బౌలర్‌గా రాణించిన యువ సంచలనం**

**తాజా మ్యాచ్‌లో కెప్టెన్సీ కూడా నిర్వహణ**

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశవాళీ క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రికార్డుల మోత మోగిస్తున్నాడు. తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ఇప్పటికే పలుమార్లు వార్తల్లో నిలిచిన ఈ కుర్రాడు, తాజాగా మరోసారి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. బెంగళూరు వేదికగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ 2026 సెమీఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తరపున ఆడుతూ అరుదైన ఘనత సాధించాడు. కేవలం 15 ఏళ్ల 175 రోజుల వయసులో హాఫ్ సెంచరీ చేసి, 57 ఏళ్ల సుదీర్ఘ రికార్డును బద్దలుకొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్, ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. కేవలం 42 బంతుల్లోనే సిక్సర్ బాది తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. తద్వారా దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు 1969లో లక్ష్మణ్ సింగ్ పేరిట ఉండేది. అప్పుడు ఆయన 16 ఏళ్ల 23 రోజుల వయసులో ఈ ఘనత సాధించారు. ఇప్పుడు వైభవ్ ఆ రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో పియూష్ చావ్లా (16 ఏళ్ల 307 రోజులు) మూడో స్థానంలో ఉన్నాడు.

**బ్యాటింగే కాదు, కెప్టెన్సీ కూడా..**

ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో వైభవ్ తన నాయకత్వ పటిమను కూడా ప్రదర్శించాడు. ఈస్ట్ జోన్ రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ కుడి చేతి మణికట్టుకు గాయం కావడంతో మైదానం వీడాల్సి వచ్చింది. ఆ సమయంలో సుమారు గంటపాటు వైభవ్ జట్టుకు తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు.

**ఆల్‌రౌండ్ నైపుణ్యం**

క్వార్టర్‌ఫైనల్‌లో నార్త్ ఈస్ట్ జోన్‌పై బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ, వైభవ్ తన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆ మ్యాచ్‌లో కేవలం మూడు ఓవర్లు బౌలింగ్ చేసి 11 పరుగులిచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. తన బౌలింగ్ గురించి బీసీసీఐ పంచుకున్న వీడియోలో వైభవ్ మాట్లాడుతూ.. "ఏ బ్యాటర్‌ను అడిగినా బౌలింగ్ చేయడం కూడా ఆస్వాదిస్తారు. వికెట్లు పడని సమయంలో ఇషాన్ భయ్యా నన్ను 2-3 ఓవర్లు వేయమన్నారు. నాతో బౌలింగ్ చేయించడం కొంత రిస్క్ అని భావించారు, కానీ నేను వికెట్లు తీయగలనని అతనికి తెలియదు" అని నవ్వుతూ చెప్పాడు. "నాకు తక్కువ ఓవర్లే దొరుకుతాయని తెలుసు. అందుకే నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి, ఒకే స్పాట్‌లో బంతులు వేయడానికి ప్రయత్నించాను" అని తన ఆలోచనా విధానాన్ని వివరించాడు. మొత్తంగా బ్యాటింగ్, బౌలింగ్, కెప్టెన్సీతో వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్‌లో భవిష్యత్ తారగా ఎదుగుతున్నాడు.

# బెల్జియం చేతిలో ఓడిన భారత్.. హాకీ వరల్డ్ కప్‌లో ఎనిమిదో స్థానంతో సరి

**హైదరాబాద్ పెన్ పవర్:** హాకీ వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్‌లో భారత్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. శుక్రవారం వావ్రేలోని బెల్ఫియస్ హాకీ అరెనాలో జరిగిన హోరాహోరీ పోరులో ఆతిథ్య బెల్జియం జట్టు షూటౌట్‌లో 4--3 తేడాతో భారత్‌పై విజయం సాధించింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరు జట్లు 3--3తో సమంగా నిలవడంతో విజేతను తేల్చేందుకు షూటౌట్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. చివరి క్షణంలో భారత జట్టు సాధించిన అద్భుతమైన గోల్‌తో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది. ఈ టోర్నమెంట్‌లో భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మొత్తం ఎనిమిది గోల్స్‌తో మెరిశాడు. అర్జెంటీనా ఆటగాడు డోమెనెతో కలిసి ఆయన టాప్ స్కోరర్ల జాబితాలో నిలిచాడు.

**ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్..**

శుక్రవారం నాటి పోరులో అభిషేక్ గోల్ కొట్టి భారత్‌కు శుభారంభం అందించాడు. మన్‌ప్రీత్ సింగ్ అందించిన పాస్‌ను అభిషేక్ షాట్‌తో బెల్జియం గోల్‌కీపర్ వాన్స్‌ను దాటించి గోల్ సాధించాడు. రెండో క్వార్టర్‌లో బెల్జియం వరుసగా 2 గోల్స్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రొమాన్ డువెక్స్లాట్(22వ నిమిషం), హ్యూగో లాబోచరే (23వ నిమిషం) గోల్స్ చేసి ఆతిథ్య జట్టుకు 2-1 ఆధిక్యాన్ని అందించారు. ద్వితీయార్ధం ప్రారంభమైన వెంటనే భారత్ కౌంటర్ అటాక్ చేసింది.

హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను అద్భుతమైన డ్రాగ్-ఫ్లిక్‌తో గోల్‌గా మలచి స్కోరును 2---2తో సమం చేశాడు. నాలుగో క్వార్టర్‌లో బెల్జియం ఆటగాడు నికోలస్ డి కెర్పెల్ మరో గోల్ సాధించి స్కోర్‌ను 3-3కి చేర్చాడు. మ్యాచ్ ముగియడానికి 26 సెకన్లుండగా భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి గోల్ కొట్టి స్కోరును 3-3తో సమం చేయడంతో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది.

**షూటౌట్‌లో తలవంచిన భారత్..**

బెల్జియం తరపున టామ్ బూన్, ఆర్థర్ డి స్లూవర్, అలెజాండ్రిక్ హెండ్రిక్స్, రొమాన్ డువెక్స్లాట్ గోల్స్ సాధించి తమ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ ఓటమితో ప్రపంచ కప్‌లో భారత్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకోగా, ఆతిథ్య బెల్జియం ఏడో స్థానాన్ని కైవసం చేసుకుంది.

# 2027 వన్డే వరల్డ్ కప్ ప్లాన్‌లో తిలక్.. శ్రేయస్‌కు టెన్షన్

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని టీమ్ఇండియా ఇప్పటి నుంచే జట్టు కూర్పుపై కసరత్తు చేస్తోంది. నంబర్-4లో కీలకంగా ఉన్న శ్రేయస్ అయ్యర్‌కు ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ యువ బ్యాటర్ తిలక్ వర్మను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కొత్త కాంబినేషన్‌పై ఫోకస్ పెట్టినట్లు సమాచారం. దక్షిణాఫ్రికా బౌన్సీ పిచ్‌లపై శ్రేయస్ ప్రదర్శన, ఫిట్‌నెస్, ఫీల్డింగ్ అంశాలను మేనేజ్‌మెంట్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు టాప్-6లో లెఫ్ట్‌హ్యాండర్ లేకపోవడంతో తిలక్‌కు అదనపు అడ్వాంటేజ్ ఉంది. హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి గాయాల నేపథ్యంలో తిలక్ తన ఆఫ్‌స్పిన్‌ను కూడా మెరుగుపరుచుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ సూచించినట్లు సమాచారం. తిలక్ భారత్ తరపున 59 టీ20లు, 5 వన్డేలు ఆడాడు. దేశవాళీ లిస్ట్-ఏలో 52 మ్యాచ్‌ల్లో 2,142 పరుగులు, 6 సెంచరీలతో 47.60 సగటు నమోదు చేశాడు. అక్టోబర్ న్యూజిలాండ్ వన్డే సిరీస్ నుంచే వరల్డ్‌కప్ ప్రణాళికలు అమలు చేసే అవకాశం ఉంది.

# వందల కోట్లు ఎందుకు దండగ? AI 'రామాయణం'తో కన్నుల పండగ!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికత సినీ ప్రపంచంలో సరికొత్త విప్లవాన్ని తీసుకొస్తోంది. భారీ బడ్జెట్‌లతో ఏళ్ల తరబడి సినిమాలు తీసే విధానానికి ప్రత్యామ్నాయంగా (AI)సాయంతో రూపొందించిన ఫ్యాన్ మేడ్ విజువల్స్, సినిమాలు అద్భుతం అంటూ ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇప్పుడు ఏకంగా 'రామాయణం' కాన్సెప్ట్ మూవీని తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో విపరీతంగా ఆకట్టుకుంటోంది. "వందల కోట్లు ఎందుకు దండగ" అనేలా రూపుదిద్దుకున్న ఈ విజువల్స్ సినీ ప్రియులను ఆశ్చర్యపరుస్తున్నాయి. నితీష్ తివారీ లాంటి దర్శకులు 'రామాయణం' ప్రాజెక్ట్ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతుంటే.. ఈ (AI) క్రియేటర్లు కేవలం కొన్ని గంటలు లేదా రోజుల్లోనే అత్యంత అద్భుతమైన విజువల్ గ్రాండియర్ దృశ్యాన్ని ఆవిష్కరించి బ్రిలియెన్సీని చాటుకున్నారు. ఆర్టిస్టులు, టెక్నీషియన్లు అంటూ వందల మందికి పేమెంట్లు ఇచ్చే పని లేకుండా పనైపోతోంది.రామాయణం ఏఐ టీజర్‌లో ముఖ్యంగా టాలీవుడ్ దిగ్గజ స్టార్ కాస్టింగ్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. సినిమా ఆద్యంతం ప్రిన్స్ మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కాంతివంతమైన-దివ్యమైన లుక్‌తో కనిపిస్తే... మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లక్ష్మణుడి పాత్రలో ఎంతో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఇక లంకాధిపతి రావణాసురుడిగా మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ ని చూపించిన తీరు మెస్మరైజ్ చేస్తోంది. భయానక మాయావి అయిన రాక్షసుడిగా అతడి అభినయం, వైఖరి - గంభీరమైన స్ఫురద్రూపం ఈ టీజర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. నితీష్ రామాయణం టీజర్‌తో యష్ కి వచ్చినంత పేరు ఇక్కడ ఎన్టీఆర్‌కి వచ్చింది.వీరితో పాటు సీతాదేవిగా కీర్తి సురేష్, ఊర్మిళగా శ్రీలీల, మండోదరిగా జాన్వీ కపూర్ తమ ప్రశాంతమైన, సౌందర్యవంతమైన రూపాలతో అలరించారు. ఇక దశరథ మహారాజు పాత్రలో నందమూరి బాలకృష్ణ రాజసంతో కూడిన గంభీరమైన లుక్‌లో కనిపించి టీజర్‌కు మరింత మైలేజ్ తెచ్చారు. ఈ నటీనటులందరినీ ఏఐ సాయంతో పర్ఫెక్ట్ రామాయణ పాత్రలుగా మలచిన తీరు వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.ఈ కాన్సెప్ట్ టీజర్‌లో భావోద్వేగాలు, యుద్ధ సన్నివేశాలను ఎంతో గ్రాండ్‌గా డిజైన్ చేశారు. తండ్రి దశరథుడి వద్ద శ్రీరాముడు వీడ్కోలు తీసుకునే సన్నివేశాలు... వనవాసానికి ప్రయాణమయ్యే దృశ్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అలాగే లంకలో రావణాసురుడి సన్నివేశాలతో పాటు వానర సేన, రాక్షస సేనల మధ్య సాగే భారీ యుద్ధ ఘట్టాలు, రామ్-లక్ష్మణుల వీరోచిత బాణప్రయోగాలు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో డిజైన్ చేయబడ్డాయి.ఏలాంటి డైలాగులతో పని లేకుండా.. కేవలం ఒక శక్తివంతమైన థీమ్ మ్యూజిక్‌ను మాత్రమే ఉపయోగిస్తూ కథను నడిపించిన తీరు టీజర్ స్థాయిని పెంచింది. మాటలవసరం లేకుండా విజువల్స్, నేపథ్య సంగీతంతోనే రామాయణ కావ్యంలోని పవిత్రతను, ఘనతను ఆవిష్కరించడం విశేషం. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సినిమా రంగాన్ని ఎంతటి అద్భుతమైన మలుపులు తిప్పబోతోందో చెప్పడానికి ఈ ఫ్యాన్ మేడ్ -రామాయణ- టీజర్ ఒక ఉదాహరణగా నిలిచింది.

**సినిమా నిర్మాణంలో సరికొత్త శకానికి నాంది:**

సినిమా నిర్మాణం అంటేనే భారీ బడ్జెట్లు, ఎండ్-లెస్ లొకేషన్ల వేట, కాస్ట్యూమ్స్, మేకప్, కారవాన్ల హడావుడి, స్టార్ ఆర్టిస్టుల కాల్షీట్ల సమస్యలు, ఖరీదైన టెక్నీషియన్లు , కెమెరా డిపార్ట్‌మెంట్లతో కూడిన సుదీర్ఘమైన షెడ్యూళ్లు. రోజులు తరబడి నటీనటుల కోసం ఎదురుచూడటం.. కోట్లాది రూపాయల ఖర్చుతో సెట్స్ వేయడం వంటివన్నీ సాంప్రదాయ సినిమా మేకింగ్‌లో భాగం. కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) అందుబాటులోకి వచ్చాక ఈ శ్రమ, సమయం , ఖర్చులన్నీ ఒక్కసారిగా తగ్గిపోయాయి. ఎటువంటి లైవ్ సెట్స్... హడావుడి లేకుండా కేవలం కంప్యూటర్ స్క్రీన్ ముందే అనుకున్న కాన్సెప్ట్‌ను అత్యున్నత దృశ్యకావ్యంగా మలచడం సాధ్యమవుతోంది.ప్రస్తుతం ఏఐ ప్రారంభ దశలోనే విజువల్స్.. నటీనటుల రూపాలు.. యుద్ధ ఘట్టాలను ఇంత అద్భుతంగా, సులువుగా ఆవిష్కరిస్తూ గొప్ప మ్యాజిక్ చేస్తోంది. కాన్సెప్ట్ టీజర్లు - గ్రాఫిక్స్ విషయంలో ఏఐ సాధిస్తున్న ఈ పురోగతిని చూస్తుంటే మునుముందు -ఆర్గానిక్ ఇంటెలిజెన్స్- (AI)లేదా మరింత అధునాతన ఏఐ సాంకేతికత వస్తే చలనచిత్ర రంగం ఏ స్థాయికి చేరుకుంటుందో ఊహించడం కూడా కష్టమే. భవిష్యత్తులో సాంకేతికత మరింత పరిణతి చెందితే.. భారీ బడ్జెట్ల అవసరం లేకుండా ప్రతీ ఒక్కరి ఆలోచనలు అత్యుత్తమ దృశ్యరూపాలుగా మారి సినిమా నిర్మాణంలో సరికొత్త శకానికి నాంది పలకడం ఖాయం. ఏఐ సినిమాలు చూడలేం అంటూనే గంటల తరబడి ఇప్పుడు కంప్యూటర్లలో యూత్ వాటిని వీక్షిస్తూనే ఉండటాన్ని గమనించాల్సి ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965